ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 22 ఆగస్టు 2025



అరవింద వారధి వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

చెత్త శుద్ధి

» పారిశుధ్యంపై 75 శాతం సంతృప్తి

» రాష్ట్రంలో గుంటూరు జిల్లా ప్రథమ స్థానం

» వెనుకబడిన పల్నాడు, బాపట్ల జిల్లాలు » చెత్త సేకరణపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే



గ్రామాల్లో చెత్తసేకరణను పర్యవేక్షిస్తున్న గుంటూరు జిల్లా జడ్పీ సీఈఓ వీర్ల జ్యోతిబసు

రేపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణ.. పారిశుధ్యంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతానికి భిన్నంగా ఇంటింటా చెత్త సేకరణ జరుగుతోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజలు తమ అభిప్రాయాలను తెలిపారు. పారిశుధ్యం, చెత్తసేకరణపై ప్రభుత్వం ఈ ఏడాది మార్చి నుంచి ఆగస్టు 11 వరకు సర్వే చేసి ప్రజల నుంచి వచ్చిన సంతృప్తి స్థాయిల ఆధారంగా జిల్లాలకు ర్యాంకులు ప్రకటించింది. ఐవీఆర్ఎస్ సర్వే నివేదిక ఆధారంగానే రాష్ట్రస్థాయి అధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు. చెత్త సేకరణపై సర్వేలో గుంటూరు జిల్లాలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు 75 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో గుంటూరు జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సర్వేలో పల్నాడు, బాపట్ల జిల్లాలు వెనుకబడ్డాయి. ఈ రెండు జిల్లాలో చెత్త సేకరణపై 66 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు.

తెల్లవారక ముందే పల్లె బాట..

జిల్లా అధికారుల కృషితోనే చెత్త సేకరణలో గుంటూరు జిల్లా

(మిగతా 6లో)

సేకరణపై సంతృప్తి

- గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు-2 లో ఉన్న 38 మందికి చెత్త సేకరణపై ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. చెత్తసేకరణపై వీరిలో 95 శాతం మంది సంతృప్తిగా ఉన్నట్లు సమాధానాలు ఇచ్చారు. వారానికి రెండు సార్లు చెత్త సేకరణ ప్రశ్నకు 89 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.
- కాకుమాను మండలం బోడెపాలెంలో 36 మందికి కాల్స్ రాగా అందరూ సానుకూలంగా స్పందించారు.
- పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం గోపాలంవారిపాలెంలో 40 మందికి సర్వే కాల్స్ రాగా 95 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.
- యడ్లపాడు మండలం సొలసలో 36 మందికి కాల్స్ రాగా 85 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.
- బాపట్ల జిల్లాలో చీరాల మండలం సాల్మన్ సెంటర్ లోని 27 మందికి కాల్స్ రాగా 88 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.

దోనేపూడి వద్ద వరద పరిశీలనలో రైతులతో కలెక్టర్

గ్రాయిన్స్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ఆనందబాబు హామీ

వరద విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధం

కొల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి వరద నేపథ్యంలో ఆందోళనలో ఉన్న రైతులకు, లంక గ్రామాల్లోని ప్రజలను గురువారం కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఆనందబాబు వేర్వేరుగా పరామర్శించి వరద విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పెసర్లంక అరవింద వారధి వద్ద, దోనేపూడి కరకట్ట దిగువున చినరేవు వద్ద వరద ప్రవాహాన్ని కలెక్టర్ పరిశీలించారు. తిప్పలకట్ట వద్ద వరద ఉధృతికి పొలాలు కోత పడుతున్నాయని ఫొటోలతో కూడిన వినతిపత్రాన్ని టీడీపీ నేత మైనేని మురళీకృష్ణ కలెక్టర్‌కు అందించి గ్రాయిన్స్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. వరదల వల్ల పంటలు దెబ్బతిన్నాయని లంక గ్రామాల పర్యటనలో పలువురు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం చిలుమూరు లంక గ్రామంలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. 5.13 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుందని కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లో 22 లంక గ్రామాలు వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగ లేదన్నారు. రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయితే ఖాళీ చేసేందుకు లంక గ్రామాల ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ గంగాధర్ గౌడ్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం, ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కె.నరసింహారావు పాల్గొన్నారు.



వరద ఉధృతికి కోత పడుతున్న పంట భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

రూ.కోట్లు నష్టం : ఎమ్మెల్యే ఆనందబాబు

వరదలు వచ్చిన ప్రతిసారి లంక గ్రామాల రైతులు వందల కోట్లు నష్టపోతున్నారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. తిప్పలకట్ట గ్రామం వద్ద నది ఉధృతికి కోతకు గురవుతున్న భూములను ఆయన పరిశీలించారు. గతంలో గ్రాయిన్స్ నిర్మాణానికి రూ.85 లక్షలతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించామన్నారు. వచ్చే వేసవిలో గ్రాయిన్స్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, డీసీ అధ్యక్షుడు యలవర్తి కోటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షులు కోగంటి హరిప్రసాద్, మేకా దివాకర్, సుంకర రాంబాబు, సుంకర శ్రీను తదితరులు ఉన్నారు.

వారు దివ్యాంగులు కాదు

పింఛన్ లబ్ధిదారుల్లో అనర్హులపై వేటు

- క్షేత్రస్థాయి సర్వేలో వైకల్యం లేదని గుర్తింపు
- బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో 10,275 మందికి రద్దు
- గ్రామ, వార్డు సచివాలయాల్లో జాబితాలు.. సెప్టెంబరు నుంచి నిలుపుదల



బాపట్ల జిల్లాలో మంచానికే పరిమితమై రూ.15 వేల పింఛను పొందేవారు 643 మంది ఉండగా, వారిలో 292 మంది మాత్రమే అర్హులని తేలింది. 24,660 మంది దివ్యాంగ పింఛనుదారుల్లో 3,853 మంది అనర్హులుగా ఉన్నట్లు గుర్తించి వారికి పింఛన్లు తొలగించారు. మరో 630 మందిని వృద్ధాప్య పింఛన్ల జాబితాలోకి మార్చారు.

చీరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వైకల్యం లేకపోయినా.. నకిలీ ధ్రువీకరణలతో.. ముడుపులు సమర్పించి.. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల సిఫార్సులతో అధికారులపై ఒత్తిడి చేయించి.. పలువురు దివ్యాంగ పింఛన్లు అందుకున్న వారిపై వేటు పడింది. క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలన చేసిన అధికారులు అనర్హులను గుర్తించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 10,275 మంది అనర్హులు దివ్యాంగ పింఛన్లు అందుకున్నట్లు గుర్తించిన ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. అర్హులు దరఖాస్తులతో కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా అనర్హులు ప్రభుత్వం అందజేసే పింఛన్‌తో లబ్ధి పొందుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దివ్యాంగ పింఛన్లలో అనర్హులపై ఎక్కడికక్కడ పెద్దసంఖ్యలో ఫిర్యాదులు రాగా గత ప్రభుత్వంలో వాటిని బుట్టదాఖలు చేశారు. కూటమి ప్రభుత్వం ఆయా ఫిర్యాదులపై ప్రత్యేకంగా దృష్టి సారించి

(మిగతా 6లో)

నిబంధనలకు తిలోదకాలిచ్చి.. ముడుపులతో ఇబ్బడి ముబ్బడిగా వెలిసిన అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి అల్లాడుతున్న సామాన్యులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చింది. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) ద్వారా ఆయా ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఇక తమ కష్టాలు తీరాయని కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆయా ప్లాట్లలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు లేక అల్లాడుతూ ఉన్న వారు ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరించేందుకు సిద్ధమవుతున్నారు.



చీరాల మున్సిపాలిటీ పరిధిలో గుర్తించిన అక్రమ లే అవుట్

ఎల్ఆర్ఎస్

- అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ
- అక్టోబరు 24 వరకు గడువు పొడిగింపు
- 2025 జూన్ 30కు ముందు కొనుగోలు చేసిన ప్లాట్లకు వర్తింపు
- బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో 700 లేఅవుట్లకు అవకాశం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ హయాంలో అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి తాము మోసపోయామని పలువురు ఫిర్యాదులు చేశారు. అయితే అప్పట్లో ఆ ఫిర్యాదులను అధికారులు బుట్టదాఖలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే అవుట్లను కొనుక్కొని లబోదిబోమంటున్న వారి సంఖ్య గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో వేలల్లోనే ఉంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అక్రమ లే అవుట్ల అంశంపై దృష్టి సారించింది. గతేడాది చివరిలోనే మున్సిపాలిటీలు, అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఅవుట్ల జాబితాను సేకరించింది. అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించే విషయంలో తీసుకునే నిర్ణయంపై జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన మూడుదఫాలుగా సమావేశాలు జరిగాయి. నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే అవుట్లలో అధికశాతం వ్యక్తిగత ప్లాట్లుగా మారినందు వల్ల తీసుకునే నిర్ణయం వినియోగదారులకు మేలు చేసేదిగా ఉండాలని నిర్ణయించింది. ఈ మేరకు విస్తీర్ణాన్ని బట్టి రాయితీ వర్తించేలా గత నెల 26న ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. తొలుత సెప్టెంబరు చివరి వరకే గడువు ఇవ్వగా

(మిగతా 6లో)

భవిష్యనిధితో భద్రత

- గ్రానైట్ కార్మికులతో కమిషనర్



కార్మికులతో మాట్లాడుతున్న పీఎఫ్ కమిషనర్ వీరభద్రస్వామి

బల్లికురవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు భవిష్య నిధి(పీఎఫ్)లో సభ్యులుగా చేరితే వారికి భద్రతో పాటు ఆర్థిక ప్రయోజనాలు అందుతాయని గుంటూరు పీఎఫ్ కార్యాలయ అదనపు కమిషనర్ వీరభద్ర స్వామి తెలిపారు. గురువారం బల్లికురవలో గ్రానైట్ క్వారీ యజమానులు, కార్మికులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కార్మికులు ప్రతీ నెల తమ జీతంలో కొంత మొత్తాన్ని భవిష్యనిధిలో జమ చేస్తే భవిష్యత్తులో వారికి ఉపయోగకరంగా మారుతుందన్నారు. పీఎఫ్‌లో ఉన్న కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు ప్రమాద బీమా అందుబాటులో ఉంటుందన్నారు. అవగాహన లేక పీఎఫ్‌లో భాగస్వామ్యులు కావడం లేదని యజమానులు పూర్తి బాధ్యత వహించి పీఎఫ్ ఉన్న కార్మికులను మాత్రమే పనుల్లోకి తీసుకోవాలన్నారు. సమావేశంలో పీఎఫ్ అధికారులు సెల్వక్టర్, గోపాల్‌సింగ్, పటాన్ ఇలియాస్, వెంకన్నబాబు, గ్రానైట్ ఫ్యాక్టరీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రత్తిపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న, శనగపై ఆసక్తి

- గణనీయంగా పెరగనున్న సాగు
- మిర్చి, పొగాకుకు ప్రత్యామ్నాయం

అద్దంకి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మిర్చి సాగుతో నష్టాలు.. బర్లీ పొగాకు సాగుతో కుదేలైన రైతులు మొక్కజొన్న, శనగ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ ఖరీఫ్‌లో మొక్కజొన్న, శనగ సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది మిర్చి సాగు చేసిన రైతులకు నష్టాల ఘాటు తగిలింది. బ్లాక్ బర్లీ, వైట్ బర్లీ సాగు వద్దని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో వీటికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, శనగ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. నీటి వసతి ఉన్న రైతులు ఇప్పటికే మొక్కజొన్న సాగు చేపట్టారు. సాగర్ ఆయకట్టులో నీటి తడులకు ఇబ్బంది ఉండదని మొక్కజొన్న సాగుకు రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. గత ఏడాది జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో సాగు కాగా ఇందులో మార్టూరు, అద్దంకి, బల్లికురవ మండలాల వాటా అధికంగా ఉంది. ఈ ఏడాది ఇప్పటికే 10 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా మరో 50 వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందని అంచనా. మార్టూరు, అద్దంకి, బల్లికురవ, పంగులూరు, ఇంకొల్లు మండలాల్లో మొక్కజొన్న సాగు అధికంగా ఉండే అవకాశం ఉంది. గత ఏడాది జిల్లాలో శనగ సాగు 10 వేల ఎకరాలకు మించలేదు. గత ఏడాది బర్లీ పొగాకు సాగు చేసిన అత్యధిక శాతం పొలాల్లో ఖరీఫ్‌లో శనగ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది మొక్కజొన్న ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులు లాభపడ్డారు. దీంతో కౌలు రైతులు కూడా ఎక్కువ శాతం మొక్కజొన్న సాగుకు సిద్ధమవుతున్నారు. బర్లీ పొగాకు ప్రత్యామ్నాయంగా శనగ, మొక్కజొన్నలనే వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. దీంతో వీటి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది.



కొమ్మినేనివారిపాలెంలో సాగు చేసిన మొక్కజొన్న



పొగాకు కొనుగోళ్లను పరిశీలిస్తున్న కర్రోతు బంగారురాజు

పొగాకు రైతులను ఆదుకుంటున్నాం

ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు

పర్చూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు కొనుగోలు చేయక, గిట్టుబాటు ధరలేక ఇబ్బందుల్లో ఉన్న బర్లీ పొగాకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు తెలిపారు. పర్చూరులోని కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే బర్లీ పొగాకును కొనుగోలు చేయడం చారిత్రాత్మకమన్నారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో 7754 మంది రైతుల వద్ద మార్క్‌ఫెడ్ రూ.100 కోట్లతో 13,100 మెట్రిక్ టన్నుల పొగాకును కొనుగోలు చేసిందన్నారు. ప్రతి రైతు నుంచి పొగాకును పూర్తిగా కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సిహెచ్.శ్రీనివాసరావు, డీఎం కరుణశ్రీ, జిల్లా మేనేజర్లు నరసింహం, రమేష్, ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, టీడీపీ నాయకులు గ్యాస్ శ్రీను, విన్నకోట సతీష్, రంగయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

వారు దివ్యాంగులు కాదు

(5వ పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించింది. ఒక ఆర్థోపెడిక్, ఒక జనరల్ ఫిజిషియన్, సంబంధిత ఏరియా వైద్య అధికారి సభ్యులుగా, వీరికి సహాయకుడిగా ఒక డిజిటల్ అసిస్టెంటుతో కూడిన ప్రత్యేక బృందాలు దివ్యాంగ పింఛన్ పొందుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అనర్హులను గుర్తించాయి. కిందటేడాది డిసెంబరులో మొదలైన పరిశీలన ప్రక్రియ ఎనిమిది నెలలపాటు కొనసాగి, ఎట్టకేలకు అనర్హుల జాబితాను ప్రకటించింది. ఆ జాబితాలో వేలమంది అనర్హులు ఉండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 40 శాతం కంటే వైకల్యం తక్కువ ఉన్నవారికి దివ్యాంగుల పింఛన్‌కు అనర్హులుగా అధికారులు నిర్ధారించారు. తీవ్ర అనారోగ్యంపాలై మంచానికే పరిమితమైనవారికి ఇచ్చే రూ.15000 పింఛను పొందేవారిలో 75 శాతం మంది అనర్హులే ఉన్నట్లు తేలింది. రూ.6000 పింఛన్ అందుకుంటున్న వారిలో 30 శాతం అనర్హులను సర్వేలో అధికారులు గుర్తించారు. పల్నాడు జిల్లాలో 3,086 మంది, గుంటూరు జిల్లాలో 2,489 మంది, బాపట్ల జిల్లాలో 3,853 మంది అనర్హులుగా గుర్తించి వారికి సెప్టెంబరు నుంచి పింఛన్‌ను రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఎలాంటి అర్హత లేనివారికి పింఛన్లు పూర్తిగా నిలిపివేయగా, సాధారణ వైకల్యం కింద దివ్యాంగులుగా ఉన్న వారికి సెప్టెంబరు నుంచి రూ.6 వేల పింఛను అందించనున్నారు. మరికొందర్ని వృద్ధాప్య పింఛన్ల జాబితాలో చేర్చి వారికి రూ.4 వేలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇక ఆయా జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాలకు అధికారులు పంపారు.

అరాచకాలు బయటపడిందిలా..

వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా పింఛన్ల మంజూరు చేశారు. అర్హులను తొలగించి, తమ అనుయాయులకు పింఛన్లు అందజేశారు. ప్రధానంగా దివ్యాంగ పింఛన్ల విషయంలో ఈ అక్రమాలు అంతులేకుండా జరిగాయి. అదే అంశాన్ని తాజా జాబితా స్పష్టం చేస్తోంది. ఇష్టమొచ్చినట్లుగా సదరం సర్టిఫికెట్లు జారీ చేయడం, వైకల్య స్థాయిని పెంచి పింఛన్లు కాజేయడం వంటి విధానాలతో అర్హులకు అందాల్సిన పింఛన్లను వైసీపీ అనుయాయులు కొల్లగొట్టారు. పింఛన్లు పంపిణీ చేసే క్రమంలో కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులకు ఈ అనర్హులు ఎదురుపడడంతో వారు విస్తుపోయారు. దీనిపై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. తొలి నెలలోనే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినా, ఇదిగోఅదిగో అంటూ డిసెంబరులో పరిశీలన ప్రక్రియ ప్రారంభించారు. దీంతో పింఛన్లలోని అక్రమాలన్నీ క్షేత్రస్థాయిలో సర్వేతో వెలుగులోకి వచ్చాయి.

ఎల్‌ఆర్‌ఎస్

(5వ పేజీ తరువాయి)

దానిని అక్టోబరు 24 వరకు పొడిగించింది. నిబంధనలకు విరుద్ధం గా వేసిన లే అవుట్‌లో ఇంటి నిర్మాణం చేపట్టా లంటే ప్లాన్ తీసుకునే సమయంలో అక్కడి విలువలో 14 శాతం ఫీజు అదనంగా చెల్లించాలి. అభివృద్ధి, ఇతరత్రా రుసుంలు అదనం. ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటుతో రూ.లక్ష ఖర్చు అయ్యే వినియోగ దారుడికి ఇప్పుడు రూ.50,000లకే అనుమతి లభించనున్నది. మున్సిపాలిటీలతో పాటు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలోని లే అవుట్లన్నింటికి ఈ ఎల్‌ఆర్‌ఎస్ వర్తించేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. 2025 జూన్ 30కు ముందు కొనుగోలు చేసిన ప్లాట్లన్నింటికీ ఈ ఎల్‌ఆర్‌ఎస్ స్కీం వర్తించనుంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా వ్యాప్తంగా చూస్తే దాదాపు 700 అనధికార లే అవుట్లకు ప్రభుత్వం క్రమబద్ధీకరణ వెసులుబాటు కల్పించింది. బావుడా కింద 93 అనధికార లేఅవుట్లను గుర్తించిన యంత్రాం గం వాటికి వెసులుబాటు కల్పించింది. ఇదే సమ యంలో భవిష్యత్తులో నిబంధనలకు విరుద్ధంగా ఏ ఒక్క లేఅవుట్ కూడా వేయకూడదని, అలా జరిగితే సంబంధిత విభాగాల అధికారులను బా ధ్యులను చేసేందుకు వెనకాడబోమని ప్రభుత్వం హెచ్చరించింది.

తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలని..

- సెల్ టవర్ ఎక్కిన వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు
- మద్దతు తెలిపిన మాజీ మంత్రి మేరుగ



టవర్ ఎక్కిన రామయ్యను కిందకు దించుతున్న స్థానికులు

బాపట్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రద్దు చేసిన దివ్యాంగ పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. బాపట్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. ఉదయం 5.30 గంటలకు టవర్ ఎక్కిన రామయ్య 11గంటల వరకు అక్కడే ఉన్నాడు. పట్టణ సీఐ ఆర్.రాంబాబు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా చర్చలు జరిపినప్పటికి వినిపించుకోలేదు. ఆయనకు మద్దతుగా దివ్యాంగులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. కలెక్టర్ వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. వీరికి మద్దతుగా సీఐటీయూ నాయకుడు కె.శరత్ వచ్చి అధికారుల వైఖరిని తప్పుబట్టారు. పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆయనకు మద్దతుగా వైసీపీ శ్రేణులు తరలి వచ్చారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున అక్కడికొచ్చి..వారికి మద్దతు తెలియజేశారు. కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రామయ్యను శాంతింప చేసి కిందకు దించే ప్రయత్నం చేశారు. ఇంతలో డీఎస్పీ జి.రామాంజనేయులు రామయ్యను ఆసుపత్రికి తీసుకెళతామని అంబులెన్స్ తెప్పించారు. అయితే కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లి వినతి పత్రం ఇస్తామని మేరుగ చెప్పడంతో అక్కడ కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో పి.గ్లోరియా ఘటనా స్థలానికి చేరుకొని వినతి పత్రం తీసుకొని వారి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం రామయ్యను అంబులెన్స్‌లో ఏరియా వైద్యశాలకు తరలించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు..

అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ ఇవ్వటం జరుగుతుందని డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 14వేల మంది దివ్యాంగ పింఛనుదారులకు నోటీసులిచ్చి సర్టిఫికెట్‌లు తెచ్చుకోమని చెప్పామన్నారు. అందులో 683 మంది మెడికల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వెళ్లకపోవడంతో.. మళ్లీ నోటీసులివ్వడం జరిగిందన్నారు. ఈ నెల 25వ తేదీలోపు మెడికల్ బోర్డుకు వెళ్లి సర్టిఫికెట్ తెచ్చుకోవాలని చెప్పామన్నారు. సర్టిఫికెట్ తెచ్చుకుంటే జూలై నెలతో కలిపి రెండు నెలల పెన్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

రామయ్యతో పాటు వైసీపీ శ్రేణులపై చర్యలు

చల్లా రామయ్యతో పాటు వైసీపీ నాయకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జి.రామాంజనేయులు తెలిపారు. పట్టణ సీఐ ఆర్.రాంబాబుతో కలిసి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. చల్లా రామయ్యతోపాటు వైసీపీ నాయకులు కర్లపాలెం కిషోర్, కోకి రాఘవరెడ్డి, కోకి అంజిరెడ్డి, నర్రావుల వెంకట్రావు, శృంగారపురం శ్రీను, జోగి రాజా మరికొందరిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రామయ్యపై గతంలో మూడు కేసులు రిపోర్ట్ అయి ఉన్నాయన్నారు. అధికారులను బెదరించడం, ప్రాణ నష్టం జరుగుతుందని తెలిసి కూడా సెల్‌టవర్ ఎక్కటం నేరమన్నారు. అతనికి ఏదైన జరిగితే కుటుంబం కూడా నష్టపోతుందన్నారు. కాబట్టి భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

గంజాయి కేసులో 14 మంది అరెస్టు

- ఇద్దరు కీలక నిందితుల పరారీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దన్ రావు

పొన్నూరుటౌన్, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న అలాగే సేవిస్తున్న 14 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెనాలి డీఎస్పీ బి.జనార్దన్‌రావు తెలిపారు. పొన్నూరు అర్బన్ స్టేషన్లో గురువారం నిందితుల అరెస్టు చూపారు. నిందితుల నుంచి కేజిన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సీఐ ఎల్.వీర నాయక్‌కు పోలీస్ స్టేషన్‌కు కిలోమీటర్ దూరంలోని ఓం కాలనీ సమీపంలోని పంట పొలాల్లో గంజాయి అమ్ముతున్నారని, తాగుతున్నారని విశ్వసనీయ సమాచారం అందినట్లు తెలిపారు. సీఐ, ఎస్సై వి.శ్రీహరి, సిబ్బంది అక్కడ సోదాలు నిర్వహించడంతో.. 14 మంది యువకులు పరార్వడానికి ప్రయత్నించగా అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. షేక్ ఫజల్, షేక్ ఫయాజ్, నక్కల రవికుమార్, షేక్ మహబూబ్ ఖాన్, షారూక్ ఖాన్, నున్న యశ్వంత్ అనే యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీరితోపాటు గంజాయి సేవిస్తున్న పఠాన్ ఇమ్రాన్ ఖాన్, షేక్ బషీర్, కంచర్ల చంద్రకాంత్, రుద్రపాటి అభిషేక్, షేక్ అల్లాబక్షు, ఖమ్మంపాటి శ్రీనాథ్ రెడ్డి, ఏకశిరి సూర్యనారాయణ, బానోతు ప్రశాంతులను అరెస్ట్ చేశామన్నారు. ఒడిశాకు చెందిన మనోజ్ అనే గంజాయి సప్లయర్‌తో పాటు, గంజాయి విక్రయించే ఆశా అనే మహిళ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ వెల్లడించారు. ఒడిశా నుంచి మనోజ్ అనే వ్యక్తి వచ్చి గంజాయి ఇచ్చి వెళ్తున్నట్లుగా నిందితులు అంగీకరించినట్లు చెప్పారు. మనోజ్ నుంచి తీసుకున్న గంజాయిని ఫజల్ అనే యువకుడు ఐదు గ్రాముల ప్యాకెట్లుగా చేసి, రూ.500కు లెక్కన విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. షేక్ ఫజల్ తల్లి ఆష కూడా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితులను స్థానిక క్రిమినల్ కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ, ఎస్ఐ, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

పవన్ కల్యాణ్‌పై నిందలు మోపే కుట్ర

- జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు మెడికల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని, సంక్షేమాన్ని సమపాళ్లలో తీసుకొని వెళ్తూ.. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై నిందలు మోపే ప్రయత్నం చేస్తున్నారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. లాడ్జి కూడలిలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఇటీవల విశ్రాంత ఐఏఎస్ విజయ్ కుమార్ పవన్ కల్యాణ్‌పై అధికార దుర్వినియోగం చేస్తున్నారని.. కోర్టులో తప్పుడు పిటిషన్ వేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో వైసీపీ కార్యకర్త కంటే హీనంగా వ్యవహరించిన విజయ్ కుమార్‌కు అవినీతి గురించి మాట్లాడే కనీస హక్కు లేదన్నారు. జగన్మోహన్‌రెడ్డి అవినీతికి అండగా నిలబడిన విజయ్ కుమార్.. చిత్తూరు జిల్లాలో అమర్ రాజా బ్యాటరీస్ రాష్ట్రం విడిచి వెళ్లిపోవడంలో ముఖ్య భూమిక పోషించారని విమర్శించారు. ప్రభుత్వంలో ముఖ్య భూమిక పోషించిన ధనుంజయ రెడ్డితో కలిసి విజయ్ కుమార్ పాల్పడిన అవినీతి అంతా ఇంతా కాదని ఆరోపించారు. గతంలో బహిరంగంగా జగన్మోహన్ రెడ్డిని దేవుడి బిడ్డగా పోల్చిన విజయ్‌కుమార్ వ్యవహారశైలిని రాష్ట్ర ప్రజలందరూ చూశారని ఆయన గుర్తు చేశారు. పవన్ కల్యాణ్‌పై నిందలు వేయటం.. ఆకాశంపై ఉమ్ము వేయడం లాంటిదని గాదె వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. జనసేన నాయకులు అడపా మాణిక్యాలరావు, శిఖా బాలు, చట్టాల త్రినాధ్, మధులాల్, పవన్, కిషోర్ పాల్గొన్నారు.

చెత్త శుద్ధి

(5వ పేజీ తరువాయి)

ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పవచ్చు. పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాలతో జడ్పీ సీఈఓ జ్యోతి బసు, డీపీవో నాగసాయికుమార్ నిత్యం ఓ గ్రామానికి వెళ్లి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కొద్ది నెలలుగా అధికారులు ఉదయమే పల్లె బాట పట్టారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులను కూడా ప్రతి రోజూ ఉదయం 7 గంటల కల్లా ఏదో ఒక గ్రామానికి పంపారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షణ పరిశీలనకు జిల్లా పరిషత్‌లో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశారు. అన్ని గ్రామాల కార్యదర్శులు ఉదయమే విధుల్లో ఉండేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు.ఈ చర్యలతో గ్రామాల్లో చెత్త తొలగింపు ప్రక్రియ చురుగ్గా సాగిందని అందువల్లే సర్వేలో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిసింది.

సమష్టి కృషితోనే ప్రథమం

అందరి సమష్టి కృషితోనే చెత్త సేకరణలో రాష్ట్రంలోనే గుంటూరు ప్రథమ స్థానంలో నిలిచింది. సీఎం, డిప్యూటీ సీఎం ఆదేశాలకు అనుగుణంగా గ్రామాలను స్వచ్ఛ మార్గంలో నడిపేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేశారు. స్వచ్ఛ గ్రామం సాకారంతోనే ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుంది. 85 శాతం సంతృప్తి దిశగా జిల్లాను తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నాం.

-వీర్ల జ్యోతిబసు, సీఈఓ, గుంటూరు జడ్పీ

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి

తాడికొండ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గ్రావెల్‌ను అన్ లోడ్ చేస్తున్న సమయంలో లారీకి హైటెన్షన్ విద్యుత్ తీగలు తగలడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం తాడికొండ అడ్డరోడ్డులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండేపూడి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ పల్లెపొగు నాగేశ్వరరావు(33) గ్రావెల్‌ను అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో విద్యుత్ హైటెన్షన్ తీగలు కిందకు ఉండటంతో టిప్పర్‌కు తగిలాయి. దీంతో డ్రైవర్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతనిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా డాక్టర్లు చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య మేరి ఫిర్యాదు చేయడంతో.. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	111, 119, 130
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

అవుట్ సోర్సింగ్‌కు..
సచివాలయ ఉద్యోగుల పర్యవేక్షణ అన్యాయం

- గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రజాక్

గుంటూరు సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల పనితీరు పర్యవేక్షణకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించడం అన్యాయం అని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశం లో గ్రామ/వార్డు సచివాలయాలను పర్యవేక్షించేందుకు మండల, జిల్లా స్థాయి కార్యాలయాల్లో పనిచేయడానికి 1,785 మంది సిబ్బందిని డిప్యూటేషన్, అవుట్ సోర్సింగ్ పద్ధతిన నియమించాలని నిర్ణయించారని తెలిపారు. గత ఆరు సంవత్సరాల నుంచి గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలనే కనీస ఆలోచన లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కారించకపోగా కొత్త సమస్యలను ప్రభుత్వం సృష్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులైన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను పర్యవేక్షించడానికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎలా నియమిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. అర్హులైన సచివాలయ ఉద్యోగులకే పదోన్నతులు కల్పించి మండల స్థాయి, జిల్లా స్థాయి సచివాలయ ప్రధాన కార్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేసి, పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వానికి సూచించారు.

స్మార్ట్ మీటర్లతో బహుళ ప్రయోజనాలు

- విద్యుత్‌శాఖ జీఎం విజయ్‌కృష్ణ



సమావేశంలో జీఎం విజయ్‌కృష్ణ, అధికారులు

రెంట చింతల, ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ వినియోగదారులు బహుళ ప్రయోజ నాలను పొందవచ్చని అక్ర మంగా విద్యుత్‌ను వాడుకున్నా, మీటర్‌కు వేసిన సీల్ తీసేసినా 135 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేయడంతో పాటు అపరాధ రుసుం విధిస్తామని ఏపీ సీపీడీసీఎల్ జీఎం(7 జిల్లాలు) విజయ్‌కృష్ణ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన రెంటచింతలలోని శివాలయం కల్యాణ మండపంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుతో సర్వర్‌కు ఎప్పటికప్పుడు సమాచారం వస్తుందని ఎక్కడైనా లోపాలుంటే వెంటనే స్పందించడానికి అవకాశం ఉంటుందన్నారు. లో వోల్టేజ్, కరెంట్ ఎన్నిసార్లు పోయింది, ఎక్కువ లేదా తక్కువ వాడుతున్నారా, ఎన్ని సార్లు అంతరాయం ఏర్పడిందనే విషయాలపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించడానికి అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రుల పేర్ల మీద ఉన్న విద్యుత్ కనెక్షన్‌ను గృహంలో ఉంటున్న వారి పేర్ల మీద మార్చుకోవాలని.. అప్పుడే పీఎం సూర్యఘర్ రాయితీ అందుతుందన్నారు. ఈఈ నూతలపాటి సింగయ్య, సీహెచ్ వెంకటేశ్వరరావు, డీఈఈ టి.వీరేశ్వరరావు, ఏఈ మస్తాన్ వలి, ఎల్ఐ శ్రీనివాసచారి పాల్గొన్నారు.

మొండికేసిన.. ● విధుల్లో చేరకపోతే ఇంటికే!
గ్రామ సచివాలయ సిబ్బందికి ఝలక్

గుంటూరు సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం అంటే ఎక్కడ బదిలీ చేస్తే అక్కడకి వెళ్లాలి. కానీ, కొందరు గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు అలా కుదరదు అంటున్నారు. అడిగిన చోట పోస్టింగ్ ఇస్తేనే వెళ్లి జాయిన్ అవుతామని మొండికేస్తున్నారు. అటువంటి వాళ్ల మీద కొరడా ఝులిపించేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు సిద్ధమయ్యారు. ఎవరైతే ఇంకా విధుల్లో చేరలేదో.. వాళ్ల సమాచారం సేకరిస్తున్నారు. వాస్తవానికి జూలై 5వ తేదీతోనే సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ సంపూర్తిగా ముగిసింది. కొన్ని శాఖలకు చెందిన ఉద్యోగులు మాత్రం ఇంతవరకు ఆయా స్థానాల్లో రిపోర్ట్ చేయలేదు. దూరంగా పోస్టింగ్ ఇచ్చారని కొందరు.. బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందని మరికొందరు కేటాయించిన చోటికి వెళ్లలేదు. అటువంటి ఉద్యోగులు.. తమను కోరిన చోటికి బదిలీ చేయించాలని ప్రజా ప్రతినిధులతో ఉన్నత స్థాయి అధికారులకు ఫోన్లు చేయించి ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న అధికారులు ఇంకా విధుల్లో జాయిన్ అవ్వని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం.



వీక్షణ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

వెబ్‌సైట్‌లో కేపీఐసీ వివరాలు పొందుపరిచాం

- చీఫ్ సెక్రటరీకి వివరించిన కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర కార్యక్రమాలపై కేపీఐసీ 95 శాతం వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చామని కలెక్టర్ జె.వెంకటమురళి రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ దృష్టికి తీసుకెళ్ళారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై రాజధాని అమరావతి నుంచి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్‌లతో చీఫ్ సెక్రటరి వీక్షణ సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర, జలశక్తిమిషన్, స్వామిత్వ, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, ప్రభుత్వసేవలు ప్రజాభిప్రాయంపై సీఎస్ సమీక్షించారు. స్వర్ణాంధ్ర కార్యక్రమాలపై స్పష్టమైన నివేదికను పంపామని కలెక్టర్ వివరించారు. క్షేత్ర స్థాయిలోని అంశాలపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. ఎక్కడా సమస్యలు ఉత్పన్నం కాకుండా పర్యవేక్షిస్తున్నామన్నారు. స్వామిత్వ సర్వే గ్రామాలలో జరుగుతుందన్నారు. గ్రామకంఠం ఆధారంగా సర్వే పక్కాగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ

బాపట్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య కేంద్రాల వైద్యులు సీజనల్ వ్యాధుల పై అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించటంతోపాటు తగిన వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. బాపట్ల ఏరియా వైద్యశాలలో గురువారం పీహెచ్‌సీ వైద్యాధికారులకు, యూపీహెచ్‌సీ అధికారులకు ఎన్‌సిడి 4.0 ప్రోగ్రామ్‌పై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రత్నమన్మోహన్, ఎన్‌సీడీపీవో డాక్టర్ లలిత రాజేశ్వరి, ట్రైనర్స్ డాక్టర్ శాంతి వైష్ణవి, డాక్టర్ శశికుమార్, డాక్టర్ గోపినాథ్, డాక్టర్ నితిన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ

కార్యదర్శుల పనితీరు పరిశీలించిన కమిషనర్

బాపట్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి గురువారం పర్యటించారు. సచివాలయ పారిశుధ్య కార్యదర్శుల రోజువారి పని తీరు రిజిష్టర్ తనిఖీ చేశారు. వారికి పలు సూచనలు చేసి వార్డుల్లో పారిశుధ్యం విషయంలో చేపట్టాల్సిన చర్యలు గురించి వివరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. గృహ సముదాయాల మధ్య నిలిచిన నీటిలో యాంటీలార్వా పిచికారి చేయాలన్నారు. అవసరమైన చోట ఆయిల్‌బాల్స్ ఉంచాలన్నారు. ప్రధాన రోడ్లల్లో, అంతర్గత రోడ్ల పక్కనే చెత్త నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. జమ్ములపాలెం రోడ్డులోని డంపింగ్ యార్డును పరిశీలించి అక్కడ బయో మైనింగ్ జరుగుతున్న తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధం విషయంలో రాజీపడవద్దని చెప్పారు. దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి జరిమానాలు విధించి నివేదిక సమర్పించాలన్నారు. అనంతరం సూర్యలంక రోడ్డులోని అన్నక్యాంటీన్‌ను పరిశీలించారు. టిఫెన్ చేయటానికి వచ్చిన వారిని ఆహార నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడి స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. క్యాంటీన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం వివేకానంద కాలనీలోని మున్సిపల్ పార్క్‌ను పరిశీలించి పార్క్ సుందరీకరణ పనులు గురించి డీఈ కృష్ణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా సుందరీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు సయ్యద్ నజీర్, సీహెచ్ కరుణ, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య కార్యదర్శుల రోజువారి పనితీరు రిజిష్టర్ తనిఖీ చేసి సూచనలు చేస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

ప్రజల భద్రతకు జనసురక్ష పథకం : ఎల్‌డీఎం

బాపట్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భద్రతకు జనసురక్ష పథకం తీసుకురావటం జరిగిందని ఎల్‌డీఎం శివకృష్ణ తెలిపారు. మండలంలోని కంకటపాలెం గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఎల్‌డీఎం శివకృష్ణ అధ్యక్షతన మేనేజర్ సాగర్ ఆధ్వర్యంలో జనసురక్ష పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన జనసురక్ష పథకంలో 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల వయసు వారికి పీఎం ఎస్‌బీవై అనే పథకం రూ.20కే ప్రమాద బీమా అందిస్తుందన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల వయసు కలిగిన వారికి పీఎం జేజేబీవై అనే పథకం రూ.436కు సహజమరణం బీమా అందిస్తుందన్నారు. బ్యాంక్‌లో ఖాతాలేని ప్రతి ఒక్కరు జన్‌ధన్ ఖాతా ఏర్పర్చుకోవాలన్నారు. అదేవిధంగా 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల వయసు కలిగిన వారికి అటల్ పెన్షన్ యోజన పథకం ఉందన్నారు. ఈ పథకంలో 60 సంవత్సరాల తర్వాత పెన్షన్ రూపంలో నగదు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది మహేంద్ర, మమత పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి : డీఎస్పీ

బాపట్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసుకునే వారు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. గత ఏడాది 410 పర్మిషన్‌లు ఇవ్వటం జరిగిందన్నారు. ఈ ఏడాది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో అనుమతులకు దరఖాస్తు చేసుకొని తీసుకోవచ్చు అన్నారు. డబ్బులు ఎవరికి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. మైక్ పర్మిషన్‌కు మాత్రమే చలానా చెల్లించాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసుకోవటానికి విద్యుత్‌శాఖాధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడరాదన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు వేడుకలు ముగిసేవరకు మండపం వద్దే ఉండాలన్నారు. పోలీసులు మానిటరింగ్ చేస్తారన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, సీఐ ఆర్.రాంబాబు

ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు జరుపుకోవాలి : ఎస్ఐ

పిట్టలవానిపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాలలో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మండపాల వద్ద వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసుకునే ఆయా గ్రామాలకు సంబంధించిన కమిటీ నిర్వాహకులు తొలుత పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖల, మండల స్థాయి అధికారులను సంప్రదించాలని చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్ తెలిపారు.

సర్వేలను త్వరితగతిన పూర్తి చేయండి : డీఎల్‌డీవో

కర్లపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : స్వామిత్వ సర్వేలన్నిటిని త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్‌డీవో సీహెచ్ విజయలక్ష్మి అన్నారు. కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయాన్ని డీఎల్‌డీవో గురువారం సందర్శించారు. కర్లపాలెం, యాజలి సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈవోపీఆర్డీ ఐనంపూడి శ్రీనివాసరావు, ఏవో రజనీ, కార్యదర్శి వీరాస్వామిరెడ్డి పాల్గొన్నారు.

ఉచితంతో పెరిగిన ఆర్టీసీ ప్రయాణం

- జిల్లా వ్యాప్తంగా 4 డిపోల పరిధిలో 212 సర్వీస్‌లు
- ఆర్టీసీలో 60 శాతం మహిళల ప్రయాణం



బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మహిళలు

బాపట్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఉచిత బస్సు ప్రయాణంతో జిల్లాలో ఆర్టీసీ సర్వీస్‌లు కిక్కిరిసిపోతున్నాయి. ప్రతిరోజు జిల్లాలో 80 నుంచి 82 వేల మంది ప్రయాణికులు ఆర్టీసీ ప్రయాణం చేసేవారు. ప్రస్తుతం దీని సంఖ్య లక్ష నుంచి లక్షా 20 వేల మందికి పెరిగింది. ఒక్కసారిగా ఉచిత ప్రయాణంతో ప్రయాణికుల సంఖ్య నానాటికి పెరిగిపోతున్నది. జిల్లా పరిధిలో నాలుగు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి డిపోల పరిధిలో మొత్తం 253 సర్వీస్‌లు ఉన్నాయి. వాటిల్లో 212 సర్వీస్‌లు ఉచిత ప్రయాణానికి కేటాయించారు. దీంతో 84 శాతం మంది బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. గతంలో జిల్లా వ్యాప్తంగా 38 లక్షల రూపాయల ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రూ.45 లక్షల నుంచి రూ.46 లక్షల ఆదాయం వస్తుందని అధికారులు తెలిపారు. ప్రయాణికుల సంఖ్యతో పాటు ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంది. ఆర్టీసికి ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ ఇస్తుంది కావున ఉచిత ప్రయాణం కూడా ఆదాయంలో చూపుతున్నారు. జిల్లాలో మొత్తం 92 వేల కిలోమీటర్ల పరిధిలో బస్సు సర్వీస్‌లు ప్రయాణికులకు సేవలందిస్తున్నాయి. స్త్రీశక్తి పథకం ప్రారంభంతో ఆర్టీసి ప్రయాణం చేసేందుకు ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు ఆర్టీసీలో మహిళలకు కొన్ని సీట్లు మాత్రమే కేటాయించేవారు ప్రస్తుతం మహిళల సీట్లు ఎక్కువై పురుషులకు కొన్నిసీట్లు మాత్రమే ఉంటున్నాయి.

ప్రయాణికుల సంఖ్య పెరుగుతుంది : డీటీవో

ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నదని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి డి.సాంబ్రాజ్యం తెలిపారు. బుధవారం లక్ష మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణించగా గురువారం లక్షా 20 వేల మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణించటం జరిగింది. ఇందులో మహిళలకు జీరో టిక్కెట్లు ఇస్తున్నాం. జీరో టిక్కెట్లతో కూడా కలిపి ఆదాయం పరిగణలోకి తీసుకుంటాం. దీనిని బట్టి 4 డిపోల పరిధిలో ప్రతిరోజు ప్రయాణికుల సంఖ్యతోపాటు ఆదాయం కూడా పెరుగుతున్నది.

నేడు ఆర్టీసీ ఎండీ బాపట్ల రాక

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం బాపట్ల ఆర్టీసీ డిపోను సందర్శిస్తారని జిల్లా ప్రజారవాణా శాఖాధికారి డి.సాంబ్రాజ్యం తెలిపారు. ఉదయం 10 గంటలకు కొత్తబస్టాండ్‌కు వచ్చి ఉచిత సర్వీస్‌లపై సమీక్షించి అనంతరం డిపో గ్యారేజిని సందర్శిస్తారని చెప్పారు.

సీపీఐ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బాపట్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌లను గురువారం చుండూరుపల్లిలో జిల్లా నాయకులు పొట్లూరి ఏసోబు, ఇండ్ల అంకమ్మరావు తదితరులు కలిసి ఆవిష్కరించారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొజ్జా శ్రీహరి, ఇండ్ల మహాలక్ష్మయ్య, పొట్లూరు వెంకయ్య, శివన్నారాయణ, ఏటగిరి మరియమ్మ, ఇండ్ల లక్ష్మీ, పొట్లూరి ఆది నారాయణమ్మ, శకుంతలమ్మ, వెంకటలక్ష్మీ, హైమావతి పాల్గొన్నారు.

పాకశాల నిర్మాణానికి భూమి పూజ

అమృతలూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పాకశాల నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. పాటిబండ్ల సుజాత జ్ఞాపకార్థం భర్త శివశంకరగాంధీ 2.50 లక్షల ఆర్థిక సహాయంతో ఈ నిర్మాణం చేపట్టినట్లు దాత తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ వెంకట శ్రీనివాసశర్మ చేతుల మీదగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండవ రమేష్, పొన్నపల్లి సత్యనారాయణ, శివరామకృష్ణ, జొన్నలగడ్డ దివాకర్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పాకశాలకు భూమి పూజ నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ వెంకట శ్రీనివాసశర్మ

మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలి : బీఎస్పీ

బాపట్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలకు విద్య, వైద్య, ఉపాధి రావాలంటే మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుడే రాజారావు తెలిపారు. మన బాపట్ల-మన మెడికల్ కళాశాల పేరిట బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో గురువారం ఆయన వివిధ పార్టీల నాయకులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గడ్డం ఏలియా, సీపీఎం నాయకులు కె.శరత్‌బాబు, నల్లమోతు శామ్యూల్ జాన్సన్, ఏపూరి జోసఫ్, కొప్పూరి రాజారావు, నూతలపాటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుడే రాజారావు

వెంకట్రామయ్య కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

చుండూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల ఉపాధ్యక్షుడు మారిశెట్టి వెంకట్రామయ్య భార్య లక్ష్మి కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గురువారం మున్నంగివారిపాలెంలోని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకట్రామయ్య కుటుంబం మొదటి నుంచి ఈ ప్రాంతంలో టీడీపీ అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. అనేక ఒత్తిడులు ఎదురైనా పార్టీ జెండా విడనాడలేదని, పార్టీ అన్ని విధాలా ఈ కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, కుర్రి వెంకటరెడ్డి, బాలకోటిరెడ్డి, అమ్మిశెట్టి శ్రీమన్నారాయణ, గుదేటి ఎల్లారెడ్డి, భీమవరపు శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

నేడు వేమూరులో టీడీపీ సమావేశం

వేమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వేమూరు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల టీడీపీ సమావేశం నిర్వహించనున్నట్లు బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మండల పార్టీ అధ్యక్షుడు గాజుల వెంకటసుబ్బయ్య తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్య అతిథిగా విచ్చేస్తారని చెప్పారు. గ్రామ టీడీపీ అనుబంధ సంఘ కమిటీలను పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

రెండు బుల్లెట్‌లు ఢీకొని వ్యక్తికి గాయాలు

బాపట్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల దగ్గర రెండు బుల్లెట్‌లు ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపిన వివరాలు ప్రకారం నెల్లూరు జిల్లా పందిపాడుకు చెందిన కొండారెడ్డి బుల్లెట్ పై కర్లపాలెం వైపు నుంచి బాపట్ల వస్తుండగా బాపట్ల వైపు నుంచి బుల్లెట్ పై కర్లపాలెం వెళుతున్న మణికంఠ ఢీకొట్టాడు. దీంతో కొండారెడ్డికి గాయాలయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు ట్రాఫిక్‌కు అంతరాయం

అమృతలూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెదపూడి-అమృతలూరు గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం జరుగుతున్నందున శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ట్రాఫిక్ నిలిపివేయడం జరుగుతుందని ఆర్ అండ్ బీ అధికారులు తెలిపారు. సింగిల్ రోడ్డు కావడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ప్రజలు సహకరించాలన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి



సీడీపీవో లక్ష్మీపార్వతికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బాపట్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం సీడీపీవో లక్ష్మీపార్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని జీవో ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గ్రాడ్యుటి జీవోలో మార్పులు చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో 42 రోజుల సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని చెప్పి పెంచలేదన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ నిర్వాహణకు ఇచ్చిన ఫోన్‌లు పనిచేయటంలేదన్నారు. సరుకులన్ని ఒక్కసారిగా రావటంలేదని నెట్‌సిగ్నల్స్ లేకపోవటంతో సర్వర్‌లు పనిచేయకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంగన్‌వాడీ యూనియన్స్‌ను చర్చలకు పిలిపించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, కార్యదర్శి శైలశ్రీ, హేమమాలిని, నిర్మల, హైమావతి, నన్నీబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్‌లు పాల్గొన్నారు.

రేపల్లెలో...

రేపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని సీఐటీయూ అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ అన్నారు. దేశవ్యాప్తంగా అంగన్‌వాడీల బ్లాక్‌డేలో భాగంగా గురువారం స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నల్లచీరలతో నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ గ్రాడ్యూటీ జీవోల్లో మార్పులు చేయాలని కోరారు. ఏఐటీయూసీ అనుబంధం అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఎస్.వాణి మాట్లాడుతూ వేతనాలు పెంచుతామని చెప్పిన ప్రభుత్వాలు నేటికి పెంచిన దాఖలాలు లేవన్నారు. తక్షణమే కూటమిప్రభుత్వం దృష్టిసారించి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌కు జీతాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, యూనియన్ నాయకురాలు ఎస్.కృష్ణకుమారి, ఎస్.రాజ్యలక్ష్మి, డి.జ్యోతి, టి.నిర్మలాజ్యోతి, పర్వీన్ పాల్గొన్నారు.

వేమూరులో...

వేమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలకు వేతనాలు పెంచడంతో పాటు లబ్ధిదారులకు ఇబ్బందికరమైన ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బొనిగల అగస్టిన్ డిమాండ్ చేశారు. మండలంలోని అంగన్‌వాడీలు నియోజకవర్గ కేంద్రమైన వేమూరులో నిరసన దినం పాటిస్తూ గురువారం మానవహార ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ సుశీలకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమానికి హాజరైన అగస్టిన్ మాట్లాడుతూ కేంద్రాల నిర్వహణకు ఇచ్చిన 2జి ఫోన్లు పని చేయడం లేదని, లబ్ధిదారులు ఫొటో క్యాప్చర్ ఓటీపీ ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు లీడర్ పి.బసవమ్మ, ఎం.పద్మావతి, అన్నపూర్ణ, జి.అమల, సునీత, ఎం.భార్గవి పాల్గొన్నారు.



రేపల్లె సీడీపీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందిస్తున్న అంగన్‌వాడీలు, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు



వేమూరులో మానవహారంగా ఏర్పడ్డ అంగన్‌వాడీలు

తహసీల్దార్, ఎంపీడీవోల పని తీరుపై కలెక్టర్ ఆగ్రహం

కొల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ కుటుంబాల వారి కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైన తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కె.నరసింహారావుల పని తీరుపై కలెక్టర్ జె.వెంకటమురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొల్లూరు మండలం చిలుమూరులంకలో గురువారం పర్యటించిన కలెక్టర్ అక్కడ నివాసం ఉంటున్న ఎస్టీ కుటుంబాల జీవన పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డులు, జాబ్‌కార్డులు, పక్కా ఇళ్లు లేవని ఆయా కుటుంబాల వారు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తహసీల్దార్, ఎంపీడీవోలపై మండిపడి ఆధార్ లేని కుటుంబాలకు ఆధార్, రేషన్, జాబ్ కార్డులు మంజూరు చేయాలని, పక్కా ఇళ్లను కూడా మంజూరు చేసి రూ.2.50 లక్షలతో ఇళ్ల నిర్మాణాలు చేసి ఇవ్వాలన్నారు. మూడు ఎస్టీ కుటుంబాలకు పీ-4 కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ దత్తత తీసుకోవాలని ఆదేశించారు. కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం సహించబోనంటూ కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ గంగాధర్ గౌడ్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం, ఆర్డీవో రామలక్ష్మి, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎస్టీ కుటుంబాల వారి నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

ఎస్టీ కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ

కొల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాలతో వరద బాధిత ఎస్టీ కుటుంబాలకు నిత్యవసరాలను తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. కొల్లూరు మండలం చిలుమూరులంకలో గురువారం పర్యటించిన కలెక్టర్ ఆ గ్రామంలో ఉంటున్న మూడు ఎస్టీ కుటుంబాల జీవన పరిస్థితి తెలుసుకున్నారు. వరద నీటిలో తమ ఇళ్లు మునిగిపోయినా ఎవరూ తమను పట్టించుకోలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే వారికి దుస్తులు, బియ్యం, పంచదార తదితర వస్తువులను తహసీల్దార్ అందజేశారు. త్వరలోనే కనీస సౌకర్యాలు కూడా కల్పిస్తామని ఆయా కుటుంబాల వారికి వివరించారు. పంపిణీ కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు : ఎంపీడీవో

చెరుకుపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కౌశలం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించి ఉపాధి అవకాశాలు కల్పిస్తారని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ క్లాస్ నుంచి పీజీ వరకు చేసిన వారు అర్హులని, వారు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు మొబైల్ లింక్ ఆధార్‌ను తీసుకువెళ్ళి ఆయా గ్రామ సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలన్నారు.

కొండముచ్చులు పట్టివేత

రేపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పాతపట్టణంలో తిరుగుతూ ప్రజలను, పశువులను ఇబ్బంది పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్న కొండముచ్చులను మున్సిపల్ అధికారులు పట్టించారు. నెల్లూరు నుంచి కోతులు పట్టే సిబ్బందిని తెప్పించిన మున్సిపల్ అధికారులు గురువారం కొండముచ్చులను పట్టించారు. పట్టుకున్న కొండముచ్చులు శ్రీశైలం అడవులలో వదిలేందుకు తీసుకెళ్లారు. దీంతో పట్టణ ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కె.సాంబశివరావు, శానిటర్ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు పాల్గొన్నారు.



కొండముచ్చులను పట్టుకున్న మున్సిపల్ సిబ్బంది

స్త్రీ శక్తి పథకం సూపర్‌హిట్

వేమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం మహిళలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని గ్రేస్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ కైతేపల్లి షాలేంరాజు అన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు. స్త్రీ శక్తి పథకం వల్ల మహిళలకు జరుగుతున్న ప్రయోజనాల గురించి మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వివరించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు అందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సూపర్‌హిట్ పాలన అందిస్తుందని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరిన్ని మేలుకరమైన ప్రయోజనాలు జరుగుతాయని వివరించారు.



మంత్రి రాంప్రసాద్ రెడ్డితో గ్రేస్ ఫౌండేషన్ అధినేత షాలేంరాజు

చింతమోటులో ఫ్లెక్సీల వివాదం

- అశోక్‌బాబు రాకతో ఉద్రిక్త వాతావరణం
- తోపులాటలు, పోలీసు అధికారులకు గాయాలు

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలు మండలం చింతమోటులో ఫ్లెక్సీల వివాదం నెలకొంది. గ్రామంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తీసి వేయాలని పంచాయతీ అధికారులు చెప్పడంతో పాటు ఫ్లెక్సీని తొలగించగా వైసీపీ మద్దతుదారులు టీడీపీ ఫ్లెక్సీ చించి వేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ విషయం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబుకు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడకు చేరుకుని తమ పార్టీ ఫ్లెక్సీలతో పాటు టీడీపీ ఫ్లెక్సీలను కూడా తీసి వేయాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులకు, వైసీపీ నాయకులు, కార్యకర్తలకు తోపులాటలు జరగడంతో చుండూరు సీఐ, భట్టిప్రోలు ఎస్ఐలు గాయపడ్డారు. పరిస్థితి చేయి దాటడంతో పోలీసులు అశోక్‌బాబును అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

కనుమరుగైన కర్మాగారం

'ఈ ఫ్యాక్టరీ ఎంతో కాలం నడవదు. తప్పని సరిగా మూత పడుతుంది.' జంపని షుగర్ ఫ్యాక్టరీ గురించి ఈ మాటలు అన్నది ఎవరో కాదు.. డెల్టా ప్రాంత రాజకీయ వాతావరణాన్ని అవపోసన పట్టిన, ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసిన అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డి. ఎంతో అనుభవంతో ఆయన అన్న మాటలు.. నేడు వాస్తవం అయ్యాయని రైతులు చెప్పుకుంటున్నారు.

- భూములు ఇచ్చిన రైతుల్లో నిరాశ
- ప్రభుత్వాల తీరును ఎండగడుతున్న రైతులు
- జీతం బకాయి, డిపాజిట్లపై ప్రశ్నలు
- భవిష్యత్ కార్యాచరణపై సందిగ్ధం



మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీ

వేమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): డెల్టా ప్రాంతంలో సహకార రంగంలో అతి పెద్దది అయిన జంపని షుగర్ ఫ్యాక్టరీ ఈనాడు పూర్తిగా కనుమరుగైంది. సహకార రంగం, రైతుల భాగస్వామ్యం ద్వారా 77 ఎకరాల భూముల్లో చక్కెర ఫ్యాక్టరీ నిర్మాణం చేశారు. 1974లో ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి చేతుల మీదుగా ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దాదాపు పదేళ్లకు నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ ఫ్యాక్టరీ.. 1984లో మొదటి క్రషింగ్ ప్రారంభించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 26 మండలాల పరిధి నుంచి ఫ్యాక్టరీకి రైతులు చెరకు సరఫరా చేశారు. రోజుకు లక్ష నుంచి 1,20,000 టన్నుల వరకు చెరకు క్రషింగ్ జరుగుతూ ఉండేది. ప్రభుత్వ ఆర్థిక సాయంతో పాటు రైతులు కూడా 12,000 మంది షేర్ హోల్డర్స్‌గా చేరి ఫ్యాక్టరీకి తమ వతు సాయం అందించారు.

ఐక్యతా లోపం..ఫ్యాక్టరీకి శాపం..

ప్రభుత్వాలు, స్థానిక ప్రజా ప్రతినిదులు, ఉద్యోగుల్లో ఐక్యత లోపించడం వల్ల ఫ్యాక్టరీ నిర్వహణ విషయంలో అనేక మార్లు సమస్యలు ఎదురయ్యాయి. క్రమేపి వివాదాలు చోటు చేసుకోవడం ఫ్యాక్టరీ క్రషింగ్ సామర్థ్యం రాను రాను తగ్గిపోయింది. రైతుకు గిట్టుబాటు ధర రాకపోవడం, కూలీల సమస్య ఏర్పడటం, ఇలాంటి అనేక కారణాల వల్ల రైతులు పూర్తిగా చెరకు సాగు నిలిపివేశారు. అప్పటి ప్రభుత్వం ఫ్యాక్టరీని 2003లో జైపూర్ షుగర్‌కు అప్పగించడం జరిగింది. వారి నుంచి మళ్లీ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని.. 2004 క్రెబ్స్ కంపెనీకి కట్టపెట్టడం జరిగింది. వారి నుంచి 2005లో మళ్లీ సహకార రంగంలోకి తీసుకున్నారు. 1984 నుంచి 2012 వరకు అనేక ఒడిదుడుకులతో నడిచిన ఫ్యాక్టరీని 2012లో పూర్తిగా మూసి వేశారు.

భవిష్యత్తు ఏంటీ..?

షుగర్ ఫ్యాక్టరీ భవిష్యత్ కార్యాచరణ ఏమిటీ? అంటూ రైతులు ప్రజలు ప్రశ్నిస్తూ ఉండగా.. భూములు ఇచ్చిన రైతులు మాత్రం పూర్తి నిరాశతో ప్రభుత్వాల తీరును ఎండ గడుతున్నారు. ఫ్యాక్టరీ నడిచిన కాలంలో పర్మినెంట్ ఉద్యోగులు 150 మంది, సీజనల్ ఉద్యోగులు 80, ఎన్ఎంఆర్‌లు 250 మందితో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూలీలకు ఉపాధి లభిస్తూ ఉండేది. దిక్కుతోచని ఉద్యోగులు జీతాలు కూడా లేక అలమటిస్తూ చివరికి వీఆర్ఎస్‌కు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో పాటు సహకార రంగంలోని ఫ్యాక్టరీలో పని చేస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ ఇతర ఉద్యోగులను పూర్తిగా తొలగించి.. పర్యవేక్షణ నిమిత్తం 2023లో లిక్విడేటర్‌ను ఏర్పాటు చేశారు. నెమ్మదిగా ఉద్యోగులకు వీఆర్ఎస్ అమలు పరచడం జరిగింది.



ఫ్యాక్టరీ నిర్మాణాలను యంత్రాలతో తొలగింపు..

ఈ తరుణంలో వారికి జీతభత్యాల బకాయి దాదాపు రూ.14.30 కోట్ల వరకు అందాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం రూ.3.50 కోట్లు మాత్రమే వారి ఖాతాలకు జమ చేశారు. దాదాపు రూ.185 కోట్ల అప్పు ప్రభుత్వం ఫ్యాక్టరీకి వివిధ రూపాల్లో ఇచ్చింది. 12 వేల మంది రైతులకు రూ.12 కోట్ల మేర షేర్ తిరిగి ఇవ్వాల్సి ఉంది. అంతే కాకుండా చెరకు తోలిన రైతుకు చెల్లించే ప్రతి టన్ను ధర నుంచి కొంత డబ్బును కట్ చేసి నాన్ రిఫండబుల్ డిపాజిట్ చేశారు. ఆ డబ్బును కూడా రైతులకు చెల్లించాల్సి ఉంది.

ప్రభుత్వం ఏం చేస్తుంది..?

చివరకు 77 ఎకరాల భూమి ఫ్యాక్టరీ పరిధిలో ఉండగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం చేస్తుందని ఈ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న మొక్కలను తొలగించేందుకు రూ.55 లక్షలకు టెండర్ పిలిచి వాటిని తొలగించే ప్రక్రియను చురుకుగా కొనసాగిస్తున్నారు. తుప్పు పట్టిన యంత్రాలు, గోడలు, షెడ్లు ఇతర భవనాలు పూర్తిగా తొలగించేందుకు టెండర్ ద్వారా రూ.9 కోట్లకు కాంట్రాక్టర్‌కు అప్పగించారు.



షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల క్వార్టర్స్ గేటు

హలో..ఉద్యోగం చేస్తారా?

● కౌశలం(వర్క్ ఫ్రం హోం)..ఫోన్ కాల్స్ ● ఆసక్తి కనబరుస్తున్న నిరుద్యోగులు ● ఇప్పటికే ఉద్యోగాలున్నాయని కొందరు..
● తమ ప్రమేయం లేకుండానే సర్వే చేశారని మరికొందరు..

గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో వచ్చిన మార్పులతో ప్రజలు ఇంటి వద్దనే ఉండి ఉద్యోగం చేసుకొనే వాతావరణాన్ని కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలుకు కార్యరూపం ఇస్తూ వర్క్ ఫ్రం హోం సంస్కృతిని విస్తరింప చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. వివిధ కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని 10వ తరగతి నుంచి పీజీ విద్యార్హతలున్న వారికి ఈ అవకాశాన్ని కల్పిస్తోంది. ఇందుకోసం కౌశలం అనే డ్యాష్ బోర్డుని ఏర్పాటు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన వర్క్ ఫ్రం హోం డోర్ టూ డోర్ సర్వేలో ఆసక్తి కనబరిచిన వారందరికి కొద్ది రోజులుగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఫోన్లు చేసి విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకొని రావాలని సమాచారం అందిస్తున్నారు. దీంతో చాలామంది నిరుద్యోగులు సచివాలయాలకు వెళుతున్నారు.

మూడు జిల్లాల్లో.. మూడు లక్షల మంది..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కలిపి దాదాపుగా మూడు లక్షల మందికి వర్క్ ఫ్రం హోం ద్వారా ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం వివిధ కంపెనీలతో టైఅప్ అవుతోంది. గుంటూరు జిల్లాలో 1,27,804, పల్నాడు జిల్లాలో 85,098, బాపట్ల జిల్లాలో 91,554 మందికి వర్క్ ఫ్రం హోం కల్పించేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా సర్వేలో ఆసక్తి కనబరిచిన వారిలో ఎవరెవరు సిద్ధంగా ఉన్నారనేది తెలుసుకోవడానికి సచివాలయాల సిబ్బంది ఫోన్ కాల్స్ చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని ఇబ్బందులు కూడా తలెత్తుతున్నాయి. సచివాలయాల సిబ్బంది సమూలంగా మారిపోవడం, ఔత్సాహికులు ఇచ్చిన ఫోన్ నంబర్లకు కాల్స్ వెళ్లకపోవడం వంటివి జరుగుతున్నాయి.

ఆసక్తి, వెనకడుగు, అనుమానం..!

కాగా సర్వే సమయంలో తాము ఇంటి వద్దనే పని చేయడానికి ఆసక్తిగా ఉన్నామని చెప్పిన వారిలో చాలామంది వెనకడుగు వేస్తున్నారు. తమకు వేరే ఉద్యోగం ఉందని, ప్రభుత్వం ఎలాంటి ఉద్యోగం తమకు ఇస్తుందని వంటి ప్రశ్నలు వేస్తున్నారు. సచివాలయాల సిబ్బంది.. ఫోన్ నంబర్‌కు వచ్చిన ఓటీపీ చెప్పని కోరడంతో.. సైబర్ నేరస్థులు ఏమైనా ఫోన్లు చేస్తున్నారా! అని కూడా సందేహాలు వ్యక్తపరుస్తున్నారు. 50 శాతం మందికి పైగా తమకు వర్క్ ఫ్రం హోం ఇష్టమని ఓటీపీ చెప్పి విద్యార్హతల సర్టిఫికెట్ల కాపీలను సచివాలయాల సిబ్బందికి అందజేస్తున్నారు. కాగా ఇప్పటి వరకు గుంటూరు జిల్లాలో 22,564, పల్నాడు జిల్లాలో 14,964, బాపట్ల జిల్లాలో 17,553 మందికి సచివాలయాల సిబ్బంది ఫోన్లు చేసి వారి అభిప్రాయాలను సేకరించారు. ఇంకా మూడు జిల్లాలు కలిపి 2.50 లక్షల మందిని సిబ్బంది నేరుగా/ఫోన్‌కాల్ రూపంలో కలిసి వారి ఆమోదం తీసుకోవాల్సి ఉంది. అప్పుడే వర్క్ ఫ్రం హోంకి ఎంతమంది సిద్ధంగా ఉన్నారనే దానిపై స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు.

అమరావతిలో.. వరద నీటి నిర్వహణపై సంతృప్తి



రాజధాని అమరావతిలో అనంతవరం నర్సరీని పరిశీలిస్తున్న అనుదీప్ గార్గ్

తుళ్లూరు,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అమరావతిలో పర్యావరణ పరిరక్షణ, వరద నీటి నిర్వహణ చర్యలపై సూపర్‌వైజర్ కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. గురువారం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ అమన్‌దీప్ గార్గ్ రాజధాని అమరావతిలో పర్యటించారు. ముందుగా ఉండవల్లిలోని రివర్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్, కొండవీటి వాగు ఫ్లడ్ పంపింగ్‌స్టేషన్‌ను పరిశీలించారు. సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ పంపింగ్ స్టేషన్ వద్ద అమరావతిలో వరద నీటి నిర్వహణకు చేపట్టిన చర్యలను ఆయనకు వివరించారు. అమరావతిలో వరద నిర్వహణ చర్యలు, భవిష్యత్తు కార్యకలాపాలు, ప్రణాళికలపై సూపర్‌వైజరీ కమిటీ తరఫున విచ్చేసిన అమన్‌దీప్ గార్గ్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అమరావతి సీడ్ యాక్సిస్ రహదారి సమీపంలో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణం, గ్రీనరీ, ఎల్పీఎస్ జోన్ల అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అనంతరం అమరావతిలోని టిడ్కో గృహ సముదాయాలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అధికారుల కోసం నిర్మించిన భవనాల సముదాయాలను సందర్శించారు. ట్రాన్స్‌లొకేటెడ్ నర్సరీని అమన్‌దీప్ గార్గ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి, సీఆర్డీఏ, ఏడీసీఎల్‌లోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


వంతెన పనుల జాప్యంలో రాజకీయ ఒత్తిళ్లు లేవు

● స్ట్రాటజిక్ ఇన్‌ఫ్రా సర్వీసెస్ సంస్థ స్పష్టీకరణ

గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కొమ్మమూరు కాలువపై గుంటూరు - చీరాల రోడ్డులో 15/8వ కిలోమీటర్ వద్ద నిర్మాణం చేపట్టిన వంతెన పనులు జాప్యం కావడంలో రాజకీయ ఒత్తిళ్లు లేవని పనులు నిర్వహిస్తున్న స్ట్రాటజిక్ ఇన్‌ఫ్రా సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ ఉపాధ్యక్షుడు జీవీ రవికాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనిని తమ సంస్థ 2023 జూన్‌లో టెండర్లలో పోటీపడి దక్కించుకొందన్నారు. ఈ ఏడాది జనవరి నాటికి రూ. 3.50 కోట్లు విలువ కాగల పనులు పూర్తి చేశామన్నారు. తమ కంపెనీకి ఆర్థికపరమైన సమస్యలు, వంతెన పనులు జరుగుతున్న సమీపంలో మరుగు ప్రవాహం కారణంగా గత 8 నెలల నుంచి పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. అంతే తప్పా ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులు లేవని స్పష్టం చేశారు. తమపై నిరాధారమైన ఆరోపణలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

వచ్చిన వరద వచ్చినట్టు..

సాగర్ జలాశయంలో 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. గురువారం 4,32,268 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 583.10 అడుగులు ఉంది. ఇది 291.95 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9019, ఎడమ కాలువ ద్వారా 6401, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,886, 8 క్రస్ట్ గేట్లను 13 అడుగులు, 18 క్రస్ట్ గేట్లను 10 గేట్లు ఎత్తి 3,81,262 ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం అవుట్ ఫ్లో 4,32,268 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

18 రేడియల్ క్రస్ట్ గేట్ల ఎత్తివేత


రెంటచింతల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు 4,23,513 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. ప్రాజెక్టు 15 గేట్లను 4.5 మీటర్లు, 3 గేట్లను 5 మీటర్ల మేర ఎత్తినట్టు వెల్లడించారు. రిజర్వాయర్‌లో 74.31(పూర్తిస్థాయి 75.50) మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.2840(పూర్తిస్థాయి 7.080)టీఎంసీలకు సమానమన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 31.87 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఈఈ రాజు తెలిపారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 12,800, లీకుల ద్వారా 400, 13 గేట్లను 44.5 మీటర్ల మేర ఎత్తి 4,00,005 క్యూసెక్కులు, మొత్తం 4,13,205 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద భారీగా వరద ఉధృతి

● కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక



తాడేపల్లి టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి భారీగా కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు ఎగువన ఉన్న కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి గురువారం రాత్రి వరకు 4,05,976 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజి రిజర్వాయర్‌కు చేరుకుంది. బ్యారేజి రిజర్వాయర్‌లో 13.7 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 4,93,822 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నందున దిగువ నదీ తీర ప్రాంత వాసులు లంక భూముల రైతులు మత్స్యకారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

లంక భూములను చుట్టుముట్టిన కృష్ణమ్మ



లంకభూముల చుట్టూ ప్రవహిస్తున్న కృష్ణానది

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమరావతి, వైకుంఠపురం, కృష్ణా జిల్లా గని ఆత్కూర్ గ్రామాల మధ్య ఉన్న వందలాది ఎకరాల లంక భూములు కొంత మేర నీట మునిగాయి. కృష్ణా నదికి 9లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రవహిస్తే లంకలో ఉంటున్న రైతులను, పశువులను అమరావతి వైపు తరలించడం జరుగుతుంది. ప్రస్తుతం 7 లక్షల క్యూసెక్కుల వరకు వరద వస్తోంది. నరుకుళ్లపాడు, ఎండ్రాయి వాగులు పెదమద్దూరు వద్ద రెండు వాగులు కలసి వైకుంఠపురం వద్ద నదిలో కలుస్తాయి. ఈ వాగులను మరమ్మతులు చేసి వాగులలో వరద నదిలో కలిసే ప్రదేశంలో (వైకుంఠపురంలోని క్రౌంచగిరికి దక్షిణం వైపున) తాడేపల్లిలో మాదిరిగా ఎత్తిపోతల పథకం నిర్మించి, వాగులలో నీటిని నదిలోకి ఎత్తిపోస్తే పంటల నష్టం తగ్గించవచ్చు.

కృష్ణమ్మ దోబూచులాట

- తగ్గినట్టే తగ్గి పెరిగిన వరద ఉధృతి
- అమావాస్య పోటుతో నదిలో పెరుగుతున్న నీటి మట్టం
- లోతట్టు ప్రాంతాల నుంచి మెరక భూముల్లోకి వరద
- ముంపు బారిన వాణిజ్య పంటలు

కొల్లూరు, భట్టిప్రోలు ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : లంక గ్రామాల రైతులతో కృష్ణమ్మ దోబూచులాడుతోంది. బుధవారం తగ్గినట్టే తగ్గి మళ్లీ గురువారం ఉదయం కృష్ణా నదిలో వరద ఉధృతి మరింత పెరిగింది. దీనికి తోడు అమావాస్య పోటు కారణంగా సముద్రంలోకి వరద నీరు వెళ్లకపోవడంతో నదిలో నీటి మట్టం అంతకంతకు పెరుగుతోంది. దీంతో లోతట్టు ప్రాంతాల నుంచి మెరక భూముల్లోకి ప్రవహిస్తూ వాణిజ్య పంటలను ముంచెత్తుతోంది. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాలు వరద భయంతో వణికిపోతున్నాయి. అరవింద వారది వద్ద కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అక్కడ ఉన్న గండి నుంచి వరద నీరు పెసర్లంక, ఆవులవారి పాలెం గ్రామాలను చుట్టుముట్టింది. చింతల్లంక, గాజుల్లంక, పోతార్లంక గ్రామాల వద్ద నది అంచులకు ఏర్పడిన గండ్ల నుంచి వరద నీరు పోటెత్తి అరటి, కంద, పసుపు, తదితర వాణిజ్య పంటలతో పాటు కూరగాయ పంటలను ముంచెత్తుతోంది. చింతల్లంక వద్ద వరద నీటిలోనే మహిళా రైతులు పొలాల్లో ఉన్న పంట ఉత్పత్తులను సేకరించి ఇళ్లకు తెచ్చుకుంటున్నారు. కొల్లూరు మండలంలోని పోతార్లంక చప్టా, భట్టిప్రోలు మండలం పెదపులివర్రు వద్ద చప్టాలపై వరద నీరు ఉధృతంగా ప్రవహిహిస్తోంది. దీంతో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పహారా కాస్తున్నారు. చింతమోటు, పెసర్లంక, పెదలంక, గ్రామాల పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లోని వాణిజ్య పంటలను వరద నీరు ముంచెత్తింది. 6 లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీరు వస్తేనే మెరక పొలాలు వరద ముంపునకు గురవుతాయి. అమావాస్య పోటుతో సముద్రంలోకి పూర్తి స్థాయిలో వరద నీరు వెళ్లడం లేదు. నదిలో నీట్టి మట్టం పెరగడంతో మెరక ప్రాంతంలోని పంటలను వరద నీరు ముంచెత్తుతోంది. ఎగువ నుంచి వరద నీరు కొంత మేరకు తగ్గడంతో రాత్రి 8 గంటలకు ప్రకాశం బ్యారేజీ నుంచి 4,87,508 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మళ్లీ వరద వస్తే మా పరిస్థితి ఏంటి?

కొల్లూరు మండలం చింతల్లంక గ్రామానికి చెందిన మహిళా రైతు చావలి ఆదెమ్మ రెండున్నర ఎకరాల్లో పసుపు, కాకర, దొండ, దోస తదితర పంటలను సాగు చేస్తోంది. గతేడాది భారీ వరదకు వేసిన పంటలన్ని తుడిచి పెట్టుకుపోయాయని చెప్పింది. అప్పులపాలై ఇప్పుడిప్పుడే ఆ పరిస్థితుల నుంచి కోలుకుంటామనే తరుణంలో మళ్లీ కృష్ణానదికి వరద పోటెత్తడంపై ఆందోళన వ్యక్తం చేసింది. తమ పరిస్థితి ఏమిటంటూ కన్నీటి పర్యంతమైంది.



వేమూరులో పూర్తిగా దెబ్బతిన్న వెదనాట్లు

పల్లపు భూముల్లో దెబ్బతిన్న వెదనాట్లు

వేమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 17 గ్రామాల పరిధిలో 80 శాతం రైతులు వెదనాట్లు వేశారు. ఈ పొలాలు పూర్తిగా నీట మునిగాయి. మురుగునీటి ప్రధాన కాల్వల మరమ్మతులు సక్రమంగా లేని కారణంగా.. నీరంతా పల్లపు భూముల్లో చేరింది. ఆ నీరు బయటకు పోక వేసిన నాట్లు పూర్తిగా కుళ్లిపోయాయి. మెరక భూముల్లో నిలిచిన నీటిని రైతులు బయటకు పంపి, నాటు మొక్కలను కొంత వరకు కాపాడుకోగలిగారు. కుళ్లిపోయిన మొక్కలను రోటోవేటర్ సాయంతో దమ్ము చేస్తున్నారు. మళ్లీ ఎకరాకు రూ.15 వేలకు పైగా ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు.



అరవింద వారధి వద్ద ఉధృతంగా వరద ప్రవాహం

నివాస గృహాలను ఖాళీ చేస్తున్న పల్లెకార్లు



ట్రాక్టర్‌లో సామగ్రి సర్దుకుంటూ..

దాచేపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ డ్యాం నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో.. గురువారం మండలంలోని రామాపురం గ్రామంలో కృష్ణా నది ఒడ్డున నివాసం ఉంటున్న పల్లె కార్లను ముందస్తుగా అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, దాచేపల్లి తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ సిబ్బందితో కలసి నది ప్రవాహాన్ని అంచనా వేశారు. నది ఒడ్డున 50కి పైగా పల్లె కార్లు నివాసం ఉంటున్నారు. రాత్రికి వరద నీరు మరింతగా పెరిగి నివాసం గృహాల్లోకి నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో వసతిని కల్పించారు. పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు, హెల్త్ సిబ్బంది రామాపురం గ్రామంలో మకాం వేశారు. ఏ సమయంలోనైనా వరద నీరు ఒడ్డెక్కే ప్రమాదం ఉందని అధికారులు, పల్లెకార్లు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.



గోతంలో సామాన్లు తరలిస్తున్న యవకుడు

వరద నీటిలో మునిగిన బెండ తోట



రైతుకు గుండెకోత..

రేపల్లె, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): భట్టిప్రోలు మండలం పెసర్లంక, ఓలేరు చప్టాలకు వరద నీరు పోటెత్తింది. లంక గ్రామాల్లోకి రాకపోకలు నిలిచిపోయాయి. పెసర్లంకకు వెళ్ళే లంక గ్రామాల రహదారులు, ఓలేరుడొంక రహదారిలో అనంతవరం సమీపంలో కృష్ణా వరద నీరు పోటెత్తటంతో కంద, పసుపు, అరటి, కూరగాయల పంటలు వందలాది ఎకరాలు జలమయమయ్యాయి. పెదపులివర్రు, ఓలేరు, పల్లెపాలెం, అనంతవరం, పెనుమూడి, మైనేని వారిపాలెం, చాట్రగడ్డ వద్ద భూములు భారీగా కోతకు గురయ్యాయి. వెయ్యి మీటర్లు ఒక్క చోటన్నా క్రాస్ బండ వేస్తే కోత నుంచి తప్పుకునే పరిస్థితి ఉంటుందని రైతులు చెబుతున్నారు.



పల్లెపాలెం సమీపంలో వరద పోటెత్తడంతో పసుపు పంట జలమయం



రావిఅనంతవరంలో భారీగా కోతకు గురైన పంట పొలాలు

అవీ..ఇవీ..

మున్సిపల్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో ప్రతినిధులు

చీరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీను గురువారం ఎన్నుకున్నారు. గత రెండు రోజులుగా చీరాల్లో నిర్వహిస్తున్న ప్రథమ మహాసభలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫెడరేషన్ అభివృద్ధితో పాటు, కార్మికుల సమస్యల పరిష్కారంలో నూతన కమిటీ కృషి చేయాలని అన్నారు. వారిని ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దఎత్తున నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

లోపాలు లేకుండా పాసుపుస్తకాలు అందజేస్తాం



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకరరావు

చినగంజాం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులకు ఎటువంటి లోపాలు లేకుండా నూతన పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రీ సర్వే సమస్యలపై గురువారం జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రీసర్వేలో రైతులకు ఎమైనా సమస్యలు వస్తే తెలియ జేయాలని తహసీల్దార్ సూచించారు. గ్రామసభలో పట్టాదారు పాసు పుస్తకం కొరకు ఒకరు, భూమి విస్తర్ణలో సవరణ చేయాలని ఒకరు అర్జీలు అందజేసినట్లు తెలిపారు. గ్రామ సభకు వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుజాత, గ్రామ రెవెన్యూ అధికారి పి.నాగరాజురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేకశ్రద్ధతో విద్యాభ్యాసం చేయాలి

- విద్యార్థులకు స్టడీ మెటీరియల్ తయారు చేసిన ఉపాధ్యాయులు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో ప్రత్యేక శ్రద్ధతోనే విద్యాభ్యాసం సాగించాలని వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు అన్నారు. పాఠశాలలో 6 నుండి 9 తరగతికి చెందిన సుమారు 300 మంది విద్యార్థులకు స్వయంగా స్టడీ మెటీరియల్ తయారు చేసి గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరోజని, జయంతి, సుబ్బారావు, నీలిమ, పోతురాజు, బ్రహ్మానందరెడ్డి, గురు తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

బల్లికురవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకలు గురువారం పల్లకి ఊరేగింపుతో ముగిశాయి. నర్సారావుపేటకు చెందిన ప్రభోదసేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ముక్తేశ్వరం గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నారు. నాలుగు రోజుల నుంచి గ్రామంలో ప్రత్యేక పూజల అనంతరం గ్రామంలో కృష్ణుని విగ్రహంతో పెద్దఎత్తున పల్లకి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఊరేగింపు ముందు భాగంలో కోలాట ప్రదర్శన ఆకట్టుకొంది.

బీజేపీ అభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా అధ్యక్షులు బంగారుబాబు .



కార్యకర్తలతో సమావేశమైన బంగారుబాబు

పర్చూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు బంగారుబాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నరేంద్రమోడీ సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరికి చేర్చేవిధంగా పార్టీ కార్యకర్తలు కృషిచేయాలన్నారు. అనంతరం పలు కుటుంబాలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాసరావు, బీజేపీ సీనియర్ నాయకులు అడపాల కృష్ణ, నటరాజ్ శ్రీను, లక్ష్మీరాజ్యం అడపాల, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో

సంతనూతలపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు పంచాయతీ బొమ్మినేనివారిపాలెం ఎం పీయూపీ స్కూల్లో గురువారం విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. బొమ్మినేని వెంకయ్య చారి టబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్త, జిల్లా టీడీపీ నాయకుడు బొమ్మినేని రామాంజనేయులు అం దించిన నోటుపుస్తకాలు, స్టేషనరీలను ఎంఈవో వెంకారెడ్డి విద్యార్థులకు పంపి ణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శేషిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగర్ కాలువకు నీళ్లు వచ్చేశాయ్..

కొనంకి సబ్ డివిజన్ పరిధిలోనికి సాగర్ జలాలు

మార్టూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : కొనంకి సబ్ డివిజన్ పరిధిలో సాగర్ కాలువలో బుధవారం రాత్రి నుంచి సాగర్ జలాలు వస్తున్నాయి. ఈ సబ్‌డివిజన్ పరిధిలోని మార్టూరు మండల పరిధిలోని సాగర్ కాలువపై ఉన్న అన్ని మేజర్లుకు, మైనర్లుకు సాగర్ జలాలు ప్రవహిస్తున్నాయి. ఇటీవల కాలువల మరమ్మతుల నిమిత్తం కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో, కాలువ పక్కన, అంచున ఉన్న చిల్లచెట్లు తొలగించారు. అక్కడక్కడ కాలువలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో ఎగువ నుండి వస్తున్న జలాలు దిగువకు వేగంగా వెళతున్నాయి. అయితే తక్కువ పరిమాణంలో నీళ్ల వస్తున్నాయి. కానీ, ప్రస్తుతం సాగర్ కాలువ నీటిని రైతులు వినియోగించుకునే అవకాశం చాలా తక్కువగా ఉంది. సాగర్ కాలువ పక్కనే ఉన్న గ్రామాలు వలపర్ల, కొనంకి, బొల్లాపల్లి, చిమ్మిరిబండ, జొన్నతాళి తదితర గ్రామాలలో వరినారు, వరినాట్లు వేసుకోవడానికి వరి పంట సాగు చేసే రైతులకు ఈ సాగర్ జలాలు ఉపయోగపడతాయి. కాని నీటి సమస్య కారణంగా, గిట్టుబాటు కాకపోవడంతో గాని, కొన్నేళ్లగా వరిపంట సాగు మండలంలో చాలా వరకు, దాదాపుగా 90 శాతం తగ్గిపోయింది. వలపర్ల రెవెన్యూ పరిధిలో గత రెండు రోజుల క్రితం,బోర్లు క్రింద సాగుచేస్తున్న పొలంలో 2 ఎకరాలలో వరినాట్లు వేశారు. గురువారం వచ్చిన సాగర్ జలాలను పరిశీలిస్తే బొల్లాపల్లి జీఎస్టీ వద్ద 105 క్యూసెక్కులు, పమిడిపాడు మేజరుకు40, యద్దనపూడి బ్రాంచ్ కెనాల్‌కు 150, కోటపాడు మేజరుకు 25, యద్దనపూడి మేజరుకు 10, ద్రోణాదుల మేజరుకు 25, నూతలపాడు మైనరుకు 44, రాజుపాలెం మేజరుకు 20 క్యూసెక్కులు నీళ్ల వెళుతున్నాయి. ఈ జలాలు మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



బొల్లాపల్లి జీఎస్‌టీ రోడ్డు వద్ద కాలువలో వస్తున్న సాగర్ జలాలు





కోటపాడు మేజరు, యద్దనపూడి మేజరు వద్ద వస్తున్న సాగర్ జలాలు, వలపర్ల పొలాల్లో వేసిన వరినాట్లు

వారు దివ్యాంగులు కాదు

(5వ పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించింది. ఒక ఆర్థోపెడిక్, ఒక జనరల్ ఫిజిషియన్, సంబంధిత ఏరియా వైద్య అధికారి సభ్యులుగా, వీరికి సహాయకుడిగా ఒక డిజిటల్ అసిస్టెంటుతో కూడిన ప్రత్యేక బృందాలు దివ్యాంగ పింఛన్ పొందుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అనర్హులను గుర్తించాయి. కిందటేడాది డిసెంబరులో మొదలైన పరిశీలన ప్రక్రియ ఎనిమిది నెలలపాటు కొనసాగి, ఎట్టకేలకు అనర్హుల జాబితాను ప్రకటించింది. ఆ జాబితాలో వేలమంది అనర్హులు ఉండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 40 శాతం కంటే వైకల్యం తక్కువ ఉన్నవారికి దివ్యాంగుల పింఛన్‌కు అనర్హులుగా అధికారులు నిర్ధారించారు. తీవ్ర అనారోగ్యంపాలై మంచానికే పరిమితమైనవారికి ఇచ్చే రూ.15000 పింఛను పొందేవారిలో 75 శాతం మంది అనర్హులే ఉన్నట్లు తేలింది. రూ.6000 పింఛన్ అందుకుంటున్న వారిలో 30 శాతం అనర్హులను సర్వేలో అధికారులు గుర్తించారు. పల్నాడు జిల్లాలో 3,086 మంది, గుంటూరు జిల్లాలో 2,489 మంది, బాపట్ల జిల్లాలో 3,853 మంది అనర్హులుగా గుర్తించి వారికి సెప్టెంబరు నుంచి పింఛన్‌ను రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఎలాంటి అర్హత లేనివారికి పింఛన్లు పూర్తిగా నిలిపివేయగా, సాధారణ వైకల్యం కింద దివ్యాంగులుగా ఉన్న వారికి సెప్టెంబరు నుంచి రూ.6 వేల పింఛను అందించనున్నారు. మరికొందర్ని వృద్ధాప్య పింఛన్ల జాబితాలో చేర్చి వారికి రూ.4 వేలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇక ఆయా జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాలకు అధికారులు పంపారు.

అరాచకాలు బయటపడిందిలా..

వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా పింఛన్ల మంజూరు చేశారు. అర్హులను తొలగించి, తమ అనుయాయులకు పింఛన్లు అందజేశారు. ప్రధానంగా దివ్యాంగ పింఛన్ల విషయంలో ఈ అక్రమాలు అంతులేకుండా జరిగాయి. అదే అంశాన్ని తాజా జాబితా స్పష్టం చేస్తోంది. ఇష్టమొచ్చినట్లుగా సదరం సర్టిఫికెట్లు జారీ చేయడం, వైకల్య స్థాయిని పెంచి పింఛన్లు కాజేయడం వంటి విధానాలతో అర్హులకు అందాల్సిన పింఛన్లను వైసీపీ అనుయాయులు కొల్లగొట్టారు. పింఛన్లు పంపిణీ చేసే క్రమంలో కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులకు ఈ అనర్హులు ఎదురుపడడంతో వారు విస్తుపోయారు. దీనిపై విచారించాలని ప్రభుత్వాన్ని కోరారు. తొలి నెలలోనే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా, ఇదిగో అదిగో అంటూ డిసెంబరులో పరిశీలన ప్రక్రియ ప్రారంభించారు. దీంతో పింఛన్లలోని అక్రమాలన్నీ క్షేత్రస్థాయిలో సర్వేతో వెలుగులోకి వచ్చాయి.

వినాయకుని మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

- డీఎస్పీ ఎండీ మొయిన్



విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ మొయిన్

చీరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే మండపాల వద్ద జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ ఎండీ మొయిన్ పేర్కొన్నారు. గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల అనుమతులను సులభతరం చేసినట్లు వివరించారు. అనుమతులు లేకుండా పందిళ్ల నిర్వహణ చేయరాదన్నారు. డీజేలతో ఆయా ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నిబంధనలు అనుసరిస్తు, అపరిచితుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. డీఎస్పీ వెంట సీఐలు శేషగిరిరావు, సుబ్బారావు, నాగభూషణం, ఎస్సైలు రాజ్యలక్ష్మి. వాణి, ట్రాఫిక్ ఎస్సై పవన్ ఉన్నారు.

మండపాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

ఇంకొల్లు : ఇంకొల్లు సర్కిల్ కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం మండల పరిధిలోని గ్రామాలలో వినాయకచవితి సందర్భంగా గణపతి విగ్రహాల పందిళ్లు, మండపాల ఏర్పాటుకు పోలీసువారి అనుమతి తప్పనిసరిగా పొందాలని సీఐ వై.వీ.రమణయ్య తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. విగ్రహాలు ఏర్పాటు చేయనున్న స్థలం వివరాలు, ఉత్సవం నిర్వహించే రోజులు, ఉత్సవ నిర్వాహకుల గుర్తింపుకార్డు నకలు స్టేషన్‌లో అందజేయాలన్నారు. విగ్రహాల ఏర్పాటు సందర్భంగా రెచ్చగొట్టే ఘటనలు తగవన్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలని ఎస్సై సురేష్ సూచించారు. భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు.

సింగిల్ విండో విధానంలో అనుమతులు

అద్దంకి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకొనేందుకు అనుమతులకు సింగిల్ విండో విధానం అమలు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. గణేష్ విగ్రహాలు ఏర్పాటు, నిమజ్జనం ఊరేగింపు తదితర అంశాలపై ఆయన స్టేషన్ సిబ్బందికి అవగాహన కల్పించారు. గణేష్ వి గ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశం, వి గ్రహం ఎత్తు, నిమజ్జనం జరిగే తేది తదితర వివరాలతో రా ష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ లో అందిన దరఖాస్తు ను పరిశీలించి అనుమతులు మంజూరుచేస్తామన్నారు.

పంగులూరు :ఈనెల 27న వినాయకచవితి పర్వదినం సందర్భంగా గ్రామాలలో ప్రత్యేక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్.ఐ. వినోద్‌బాబు తెలిపారు.

ఆకట్టుకుంటున్న 'విజ్ఞాన ప్రపంచం'

- విజయవాడ బుక్ ఫెస్టివల్‌కు విశేష స్పందన
- పుస్తక ప్రియులతో పీవీఆర్‌లో సందడి





బుక్ ఫెస్టివల్‌లో సందడి చేస్తున్న విద్యార్థులు

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది. స్థానిక పీవీఆర్ బాలుర పాఠశాల ఆవరణలో గత వారం రోజులుగా కొనసాగుతున్న ఫెస్టివల్‌ను వీక్షించేందుకు పుస్తకప్రియులు పోటెత్తుతున్నారు. కాగా ప్రదర్శనలో సుమారు 50వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉంచారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, కవులు, కళాకారులు, రచయితలు, సాహితీ వేత్తలు వీక్షించడంతో ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఇప్పటి వరకు సుమారు 40 వేల మంది సందర్శకులు పుస్తక ప్రదర్శనను వీక్షించినట్లు నిర్వాహకులు మనోహర్‌రెడ్డి తెలిపారు. విలువైన విజ్ఞానంతో కూడిన పుస్తకాలు, అలాగే ప్రముఖుల ర చనలు, సైన్స్ పుస్తకాలు, మహిళల కోసం,. ఇలా ఒకటేమి వివిధ రకాల పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. కాగా ప్రతిరోజు నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వ హించడంతోపాటు, సైన్సు గొప్పతనాన్ని వివరించేలా ఏర్పాటు చేసి న ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈనెల 25వ తేదీన ఆదివారంతో పుస్తక ప్రదర్శన ముగియనుంది. దేశంలో ప్రాముఖ్యత కలిగిన విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ నగరంలో ఏర్పాటు చేయ డంపై పుస్తకప్రియులు ఆనందరం వ్యక్తం చేస్తున్నారు. - ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

చెత్తశుద్ధి

(5వ పేజీ తరువాయి)

ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పవచ్చు. పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాలతో జడ్పీ సీఈఓ జ్యోతి బసు, డీపీవో నాగ సాయికుమార్ నిత్యం ఓ గ్రామానికి వెళ్లి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కొద్ది నెలలుగా అధికారులు ఉదయమే పల్లె బాట పట్టారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులను కూడా ప్రతి రోజూ ఉదయం 7 గంటలకల్లా ఏదో ఒక గ్రామానికి పంపారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షణ పరిశీలనకు జిల్లా పరిషత్‌లో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశారు. అన్ని గ్రామాల కార్యదర్శులు ఉదయమే విధుల్లో ఉండేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. ఈ చర్యలతో గ్రామాల్లో చెత్త తొలగింపు ప్రక్రియ చురుగ్గా సాగిందని అందువల్లే సర్వేలో ప్రజలు సంతృప్తి వ్యక్తమైంది.

సమష్టి కృషితోనే ప్రథమం

అందరి సమష్టి కృషితోనే చెత్త సేకరణలో రాష్ట్రంలోనే గుంటూరు ప్రథమ స్థానంలో నిలిచింది. సీఎం, డిప్యూటీ సీఎం ఆదేశాలకు అనుగుణంగా గ్రామాలను స్వచ్ఛ మార్గంలో నడిపేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేశారు. స్వచ్ఛ గ్రామం సాకారంతోనే ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుంది. 85 శాతం సంతృప్తి దిశగా జిల్లాను తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నాం.

-వీర్ల జ్యోతిబసు, సీఈఓ, గుంటూరు జిల్లా పరిషత్

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా చొరవ తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి కోరారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని పాత రిమ్స్‌లోని డీపీహెచ్‌ల్యా బ్ ఆఫీస్ కార్యాలయంలో రండీ టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యలపై చర్చించుకు న్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభు త్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాం దురంగారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, ఎం.శ్రీనివాసరావు, ఏసురత్నం, మహిళావిభా గం అధ్యక్షురాలు రజితమానస, ఆశాఖ ఉద్యోగులు వెంకటేశ్వరరావు, శ్రీనివాస రావు, వెంకటేశ్వరరెడ్డి, గోవిందరావు, పవన్, మోహన్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

క్షౌరశాలలకు ఉచిత విద్యుత్

200 యూనిట్లు ఫ్రీ

ఉత్తర్వులు విడుదల

నాయీబ్రాహ్మణులు అందరికీ వర్తింపజేయాలని డిమాండ్

ఒంగోలు క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : క్షౌరశాలలు నిర్వహించే నాయీబ్రాహ్మణులకు నెలకు 200 యూనిట్లు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 150 యూనిట్లు ఉచితంగా ఇచ్చింది. ప్రస్తుతం తిరిగి 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా సరఫరా చేసేందుకు తిరిగి ప్రజాప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు ఉచిత విద్యుత్తు పథకాన్ని సరిగా అమలుచేయకపోవడంతో లబ్ధిదారులు ఎక్కువగా వినియోగించుకోలేకపోయారు.

విధివిధానాలు

- క్షౌరశాల నిర్వాహకుడు నాయీ బ్రాహ్మణుడు అయిఉండాలి
- నెలకు 200 యూనిట్లకు పైగా విద్యుత్తు వినియోగించకూడదు
- అర్బన్ ప్రాంతాలలో నెలకు రూ.70 వేలు, రూరల్ ప్రాంతంలో రూ.60 వేలు ఆదాయం పొందే వారు అర్హులు
- రెవెన్యూ అధికారి ద్వారా పొందిన కులధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుకు జతపరచాలి.

బడ్జెట్ కేటాయింపు

నాయీబ్రాహ్మణులు నిర్వహించే క్షౌరశాలలకు 200 యూనిట్లు ఉచితం కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.450 ప్రకటించి ఈ నెల నుంచి అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో లబ్ధిదారులు ఒంగోలు డివిజన్‌లో 124, కందుకూరు డివిజన్‌లో 93, కనిగిరి డివిజన్‌లో 15, దర్శి డివిజన్‌లో 28, మార్కాపురం డివిజన్‌లో 122 మంది ఉన్నారు. ఉచిత విద్యుత్తు పథకాన్ని విస్తృతంగా ప్రచారం చేసి లబ్ధిదారుల ముంగిటకు చేర్చాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి నెలకు రెండువేల రూపాయలు ఉచితంగా లబ్ధిచేకూరుతుంది. ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం.. 382 మందికి ఏడాదికి కోటి రూపాయల లబ్ధి చేకూరుతోంది. లబ్ధిదారులు ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



అర్హులైన ప్రతిఒక్కరికి అందే విధంగా చర్యలు

కట్టా వెంకటేశ్వర్లు, ఎస్ఈ



నాయీబ్రహ్మణులకు ప్రతి ఒక్కరికీ అందేవిధంగా చర్యలు చేపట్టాం. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి జీవితాలలో వెలుగుల నింపేందుకు 200 యూనిట్లు ఉచిత పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకంపై అవగాహన పెంచేందుకు విద్యుత్తు శాఖ తరపున చర్యలు తీసుకుంటున్నాం. క్షౌరశాలలు నడిపే నాయీబ్రాహణులు ధ్రువీకరణ పత్రాలు తీసుకొని మండల విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికార్లను సంప్రదించాలి.

ప్రతి ఒక్కరికీ 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలి

కొణిజేటి రామకృష్ణ, అధ్యక్షుడు, ఒంగోలు నగర క్షౌరశాలల సంఘం



క్షౌరశాలలు నిర్వహిచుకునే నాయీబ్రాహణులు అందరికీ 200 యూనిట్లు ఉచితం పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలి. కాల్చిన యూనిట్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకోవడం వల్ల కొందరే అర్హులుగా మిగులుతారు. ఈ మేరకు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతి పత్రం అందజేశాం. క్షౌరశాలలో వచ్చిన బిల్లులో 200 యూనిట్లు మినహాయించి మిగిలిన విద్యుత్తుకు బిల్లు వేయాలని కోరాం.

ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో ఉన్న వారికి చేర్చాలి

పెళ్లూరు చినవెంకటేశ్వర్లు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్



గతంలో తెలుగుదేశం నాయీబ్రాహ్మణుల కోసం ప్రవేశపెట్టిన ఈ పథకం వైసీపీ హయాంలో లబ్ధిదారులకు సక్రమంగా చేరలేదు. తిరిగి ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత 200 యూనిట్లు ఉచితం ఇస్తూ ఉత్తర్వులు ఇవ్వడం సంతోషం. అధికారులు ఈ పథకంపై గ్రామాల్లో ఉన్న నాయీబ్రాహ్మణులకు అవగాహన కల్పించాలి.

ఎల్ఆర్ఎస్

(5వ పేజీ తరువాయి)

దానిని అక్టోబరు 24 వరకు పొడిగించింది. నిబంధనలకు విరుద్ధం గా వేసిన లే అవుట్‌లో ఇంటి నిర్మాణం చేపట్టా లంటే ప్లాన్ తీసుకునే సమయంలో అక్కడి విలువలో 14 శాతం ఫీజు అదనంగా చెల్లించాలి. అభివృద్ధి, ఇతరత్రా రుసుంలు అదనం. ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటుతో రూ.లక్ష ఖర్చు అయ్యే వినియోగదారుడికి ఇప్పుడు రూ.50,000లకే అనుమతి లభించనున్నది. మున్సిపాలిటీలతో పాటు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలోని లే అవుట్లన్నింటికి ఈ ఎల్ఆర్ఎస్ వర్తించేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. 2025 జూన్ 30కు ముందు కొనుగోలు చేసిన ప్లాట్లన్నింటికీ ఈ ఎల్ఆర్ఎస్ స్కీం వర్తించనుంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా వ్యాప్తంగా చూస్తే దాదాపు 700 అనధికార లే అవుట్లకు ప్రభుత్వం క్రమబద్ధీకరణ వెసులుబాటు కల్పించింది. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(బావుడా) కింద 93 అనధికార లేఅవుట్లను గుర్తించిన యంత్రాంగం వాటికి వెసులుబాటు కల్పించింది. ఇదే సమయంలో భవిష్యత్తులో నిబంధనలకు విరుద్ధంగా ఏ ఒక్క లేఅవుట్ కూడా వేయకూడదని, అలా జరిగితే సంబంధిత విభాగాల అధికారులను బాధ్యులను చేసేందుకు వెనకాడబోమని ప్రభుత్వం హెచ్చరించింది.

అవీ..ఇవీ..

అన్న క్యాంటిన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



అన్న క్యాంటిన్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ మోహన్

మార్టూరు, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి):మార్టూరులో నాగరాజుపల్లి కూడలి వద్ద నిర్మించనున్న అన్నా క్యాంటీన్ భవనం ఏర్పాటుకు స్థలాన్ని గురువారం పబ్లిక్ హెల్త్ సర్వీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, స్థానిక కూటమి ప్రభుత్వం నాయకులతో కలిసి పరిశీలించారు. మార్టూరులో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, రూ. 61 లక్షల మంజూరుచేయించారు. నాల్గవ గ్రామ సచివాలయం నిర్వహిస్తున్న భవనానికి, పంచాయతీ రాజ్ భవనానికి మధ్య ఖాళీ స్థలంలో అన్న క్యాంటీన్ ను ఏర్పాటుచేయడానికి అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు పబ్లిక్ హెల్త్ సర్వీస్ నెల్లూరు సర్కిల్ ఎస్ఈ టీ.మోహన్, పబ్లిక్ హెల్త్ సర్వీస్ డివిజనల్ అధికారి టీఎస్ సంజయ్, జడ్పీ సీఈవో చిరంజీవిలతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. భవిష్యత్తులో జాతీయరహదారి విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ భవనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థలం కొలతలను స్థానిక సర్వేయర్లు, అధికారులతో ఎస్ఈ మోహన్ చర్చించారు. అయితే అక్కడ పంచాయతీరాజ్‌కు చెందిన శిథిలమైన గది అన్నక్యాంటీన్ భవన నిర్మాణానికి అడ్డంకిగా ఉండటంతో, దానిని తొలగించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు షేక్ రజాక్, కమ్మ శివనాగేశ్వరరావు, మిన్నెకంటి రవికుమార్, తొండెపు ఆదినారాయణ, గొట్టిపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ గురువారం తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో వెలగపూడిలోని సచివాలయంలో మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి, ఆ శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి తెలిపారు. అంగన్‌వాడీలకు వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు, పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు పెంచాలని, హెల్త్ కార్డులు, పెండింగ్‌బిల్లులు చెల్లింపు వంటి పలు సమస్యలను పరిష్కారించాలని వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలల్లో వంటకోసం కరెంటు పోయ్యిలు, కరెంటు బిల్లు రూ.200 నుండి రూ.500 ఇస్తామని మంత్రి తెలియజేశారన్నారు. కేంద్రాలలో రిజిస్టర్‌లు రావాల్సిన అవసరం లేదని యాప్‌లలో అన్ని నమోదు చేయాలన్నారు. ఈ నెల చివరి నాటికి 5జీ ఫోన్లు ఇస్తామని, ప్రభుత్వం ప్రకటించిన గ్రాట్యూటీ మార్పులు చేసి రెండు, మూడు రోజులలో జీవో రిలీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లి లక్ష్మీనరసమ్మ, ట్రెజరర్ కోడాలి హేమలత తదితరులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి స్థానికులు సహకరించాలి



పాఠశాలకు కంప్యూటర్ బహూకరిస్తున్న దాతలు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు ఆయా ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చొరవ చూపినట్లయితే చిన్నారుల భవితవ్యం బంగారు మార్గంలో సాగుతుందని పలువురు వక్తలు అన్నారు. గురువారం వేటపాలెం మండలం ఆమోదగిరిపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బట్టా రాంబాబు రూ. 40 వేలు విలువగల కంప్యూటర్, ప్రింటర్, స్కానర్‌లను బహూకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలోని అవకాశాలను విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని సూచించారు. ప్రధానోపాధ్యాయులు శేఖరరావు దాతను అభినందించారు. కార్యక్రమంలో శంకరబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఎంవీబీఆర్‌వై పథకంపై అవగాహన

మార్టూరు, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి):ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ వారు కొత్తగా ప్రారంభించిన ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనపై గురువారం మార్టూరు సమీపంలోని అమరావతి నూలుమిల్లులో ఉద్యోగులకు, యజమానులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటూరు ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ -2 తానయ్య సెల్వక్టర్, ఒంగోలు అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పి గోపాల్‌సింగ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తానయ్య సెల్వక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కొత్త ఉద్యోగులను నియమించుకోవడానికి ఆర్థిక ప్రయోజనాలను అందించడం ద్వారా కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడానికి యజమానులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కార్యక్రమంలో పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పఠాన్ ఇలాయాస్ పాల్గొన్నారు.

పింఛన్‌దారుల్లో అయోమయం

- అనర్హత పింఛన్లపై వేటుకు ప్రభుత్వం చర్యలు
- వెయ్యి మందికి నోటీసులు, అప్పీలుకు మరో అవకాశం



చీరాల వైద్యశాల వద్ద ఉన్న నోటీసు అందుకున్న విభిన్న ప్రతిభావంతులు

చీరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అనర్హత ఉన్న పింఛన్ల వేటుకు కూటమి ప్రభుత్వం రీవెరిఫికేషన్ చేపట్టింది. ఈక్రమంలో సచివాలయ సిబ్బంది నియోజకవర్గంలో సుమారు 1000 మందికి ఇప్పటికే నోటీసులు అందించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బడిముబ్బడిగా అనర్హులకు సదరం సర్టిఫికెట్లు అందించి, వివిధ రకాల పింఛన్లను అందజేసింది. ఈ నేపథ్యంలో రూ.కోట్లల్లో ప్రభుత్వ ఖజానాకు గండి పడింది. అయితే కూటమి ప్రభుత్వం అందుకు స్పష్టమైన ప్రణాళికతో అర్హులే ప్రామాణికంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది జనవరి నుంచి విభిన్న ప్రతిభావంతుల రీవెరిఫికేషన్ ప్రారంభించింది. ఈక్రమంలో అన్ని కేటగిరీల్లో ఇప్పటి వరకు వైద్యుల ఆమోదం పొందిన విభిన్న ప్రతిభావంతుల వైకాల్యానికి సంబంధించి ఎంత శాతం ఉందనేది పింఛన్ వెబ్‌సైట్‌ను అనుసంధానం చేసింది.

గణనీయంగా పింఛన్ల అర్హుల ప్రక్రియ

ఇప్పటి వరకు వివిధ రకాల పింఛన్లు అందుకుంటున్న పింఛన్‌దారులకు వారి ధ్రువపత్రాల ఆధారంగా గణనీయంగా పింఛన్లకు అధికారులు వెసలుబాటు కల్పిస్తూ, జాబితాలు సిద్ధం చేసి ఆయా ప్రాంతాల సచివాలయాలకు పంపించారు. వీరిలో ఇప్పటి వరకు మంచానికే పరిమితమై వెరిఫికేషన్‌లో 85 శాతం పైబడి ఉంటే వారికి రూ.15 వేలు యథావిధిగా సెప్టెంబరు నుంచి అందించనున్నారు. అలాగే వెరిఫికేషన్‌లో 85 శాతం కంటే తక్కువగా ఉండి, 40 శాతంకంటే ఎక్కువగా ఉండిన వారిని హెల్త్ పెన్షన్ నుంచి విభిన్న ప్రతిభావంతుల పెన్షన్‌గా మార్చి రూ.6 వేల అందించనున్నారు. అలాగే వైకల్య శాతం 40కు తక్కువగా ఉండి 60 సంవత్సరాలు లేనివారి పింఛన్లు తొలగించేలా ప్రణాళిక చేశారు.

అనర్హులకు ఇప్పటికే నోటీసులు

నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు 1000 మందికి అనర్హుల పింఛన్లను గుర్తించిన అధికారులు నోటీసులు అందించారు. అయితే అవగాహన లేమితో చాలా వరకు ఏమి చేయాలో తోచక అయోమయంలో ఉన్నారు, కానీ నోటీసులు అందుకున్న వారిలో ఎవ్వరైనా అర్హులైన పింఛన్‌దారులు ఉన్నట్లయితే వారికి తిరిగి పింఛన్ పొందె వెసులుబాటు కల్పిస్తూ మరో అవకాశం ఇచ్చారు. వీరు నోటీసు అందుకున్న 30 రోజుల్లో పట్టణాలలో అయితే కమిషనర్, గ్రామీణ ప్రాంతాలలో అయితే ఎంపీడీవోలకు వినతి పత్రాలు అందించాల్సి ఉంటుంది. తద్వారా మళ్లీ అధికారులు కల్పించిన తేదీల్లో హాజరై వారి ద్వారా పొందిన వాస్తవమైన సదరం ధ్రువపత్రంతో పింఛన్ పొందాల్సి ఉంటుంది. తద్వారా అర్హులు పింఛన్లకు దూరం కాకుండా ప్రభుత్వం చూస్తోంది.

పర్చూరు వాగుకు మోక్షం

శరవేగంగా కట్టలు బలోపేతం



వాగులోని ముళ్ల చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్



కట్టలను పటిష్టం చేస్తున్న ఎక్స్‌కవేటర్

పర్చూరు, అగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు- కారంచేడు (ఉప్పుటూరు వరద) వాగు ఆధునికీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వర్షాకాలంలో వరదలకు పంటపొలాలు నీట మునిగిపోకుండా ఈ వాగు లక్షలాధి ఎకరాలకు అడ్డుకట్ట వేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వాగు అభివృద్ధికి నోచుకోకపోవడంతో చిల్లచెట్లు, ముళ్లపొదలతో నిండిపోయి, కరకట్టలు బలహీనంగా మారాయి. వాగు పరిస్థితిపె స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు యుద్ధ ప్రాతిపతికన వాగు అభివృద్ధిపై చర్యలకు స్వీకారం చుట్టారు. అందులో భాగంగా వాగులో పెరిగిపోయిన చిల్లచెట్లు, ముళ్లపొదలను తొలగించటంతో పాటు, వాగు ను త్వవ్వి కట్టలను బలోపేతం చేసేవిధంగా చర్యలు చేపడతున్నారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పర్చూరు - కారంచేడు మధ్య 4 కిలో మీటర్ల మేర లక్షల వ్యయంతో పూడికతీత పనులు జరుగుతున్నాయి. కట్టలను పటిష్టంచేసి అధునీకరించేలా ఎమ్మెల్యే ఏలూరి చూపుతున్న చొరవ పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాలను సాగు చేయాలి

ఆత్మ డిప్యూటి ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయనిర్మల



మాట్లాడుతున్న ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయనిర్మల

అద్దంకిటౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా అపరాలను సాగు చేసుకోవాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయనిర్మల సూచించారు. గురువారం మండలంలోని కొంగపాడు గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో వివిధ పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పొగాకు ప్రత్యామ్నాయంగా అపరాలు, మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేసుకోవాలన్నారు. అద్దంకి ఏడీఏ బి.ఎఫ్రాయిమ్ మాట్లాడుతు కలెక్టర్ ఆదేశాల మేరకు బర్లీ పొగాకు సాగుచేయవద్దని సూచించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత డాక్టర్ మురళీధర్ నాయక్ మినుము, కంది, పెసర, శనగ పంటల సాగు, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేతలు ఎం. ఉషా అపరాల సాగులో విత్తనశుద్ధి గురించి, మరో శాస్త్రవేత కే.మృదుల అప రాలు, మొక్కజొన్నలో కలుపు నివారణ చర్యలు గురించి రైతుల కు వివరించారు. కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ మణికేశ్వరం సొసైటీ అధ్యక్షుడు నర్రా బ్రహ్మానందం, గుడిపూడి బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శులు ప్రిస్కిల్లా , మస్తాన్‌వలి, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ రామిరెడ్డి, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ సాయిబాబు, రైతులు పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్ల ఔత్సాహికులకు ప్రోత్సాహం

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

చీరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణ సాగించుకుని అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకం కల్పిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం చీరాల ఎక్సైజ్ శాఖా కార్యాలయంలో సిఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రముఖులు, రిసార్ట్ నిర్వాహకులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఔత్సాహికులకు అవకాశాలు కల్పిస్తు విధివిధానాల్లో కొన్ని వెసులుబాటులు తెచ్చినట్లు వివరించారు. ఈనేపథ్యంలోనే ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆసక్తి కలిగిన వారు వివరాలు అందజేయాలని సూచించారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

- పలువురికి స్వల్ప గాయాలు
- చీరాల - వేటపాలెం రోడ్డులోని విశాల్ మార్ట్ వద్ద ఘటన

చీరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును వెనుక వస్తున్న మరో బస్సు ఢీ కొనడంతో సుమారు 25 మంది ప్రయాణీకులు స్వల్పంగా గాయపడ్డారు. ఈఘటన గురువారం రాత్రి చీరాల - వేటపాలెం రోడ్డులోని విశాల్ మార్ట్ వద్ద జరిగింది. రెండు బస్సులు ఒంగోలు నుండి చీరాలకు ప్రయాణీకులతో వస్తున్నాయి. అయితే అకస్మాత్తుగా జరిగిన ప్రమాదంలో వెనుక బస్సు కండక్టర్ కూడా గాయపడ్డారు.

వాహనతనిఖీ రహదారి భద్రతపై అవగాహన

పంగులూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ వినోద్‌బాబు ద్విచక్ర వాహనచోదకులను హెచ్చరించారు. మండలంలోని అలవలపాడు అడ్డరోడ్డువద్ద 16వ నెంబరు జాతీయరహదారిపై గురువారం సాయంత్రం స్టేషన్ సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ నిర్వహించారు.

వైద్యశాల అభివృద్ధికి నిధులు



వైద్యాధికారికి చెక్కును అందజేస్తున్న రమేష్

సంతమాగులూరు ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సంత మాగులూరు ప్రాథమిక వైద్యశాల అభివృద్ధికి ఏఎంసీ చైర్మన్ తేల ప్రోలు రమేష్ ఆర్థిక సహకారం అంద జేశారు. టీడీపీ నాయకులు చేవూరి వాసురెడ్డి మండలంలోని ప్రజా సమస్యల పరిష్కార సమీక్షలో సంతమాగులూరు ప్రాథమిక వైద్యశాలలో మౌలిక వసతుల కొరత వారిదృష్టికి వచ్చింది. తక్షణమే స్పందించిన ఏఎంసీ చైర్మన్ రమేష్ మౌలిక వసతుల్లా కల్పనకు తనవంతుగా రూ.1.5 లక్షలు సమకూర్చను ఉన్నట్లు ప్రకటించారు. ఏ మేరకు నగదు చెక్కును వైద్యాధికారి సాహిత్యకు అందజేశారు. కార్యక్రమంలో దాత పేలప్రోలు రమేష్‌తో పాటు టీడీపీ మండల నాయకులు చేవూరు వాసురెడ్డి, అట్లా పెద్ద వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రమేష్‌ను వైద్యాధికారులు నిర్మలకుమార్ వైద్యశాల సిబ్బంది, మండలంలోని కూటమి ప్రజా ప్రతినిధులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- ఎంఈవో శివకోటేశ్వరరావు

పర్చూరు, అగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ ప్రతి. ఒక్కరి బాధ్యతని మండల విద్యాశాఖాధికారి ఏ.శివకోటేశ్వరావు అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆహ్లాద వాతావరణంతోపాటు, స్వచ్ఛమైన గాలి అందాలంటే మొక్కలే ప్రదానం అన్నారు.

అట్టహాసంగా లక్ష్మయ్య బాధ్యతల స్వీకరణ

- పలు గ్రామాల టీడీపీ నేతల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహణ



బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మయ్యను ఆశీర్వదిస్తున్న టీడీపీ నేతలు

బల్లికురవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ గ్రామ సహకార సంఘ అధ్యక్షునిగా గొట్టిపాటి లక్ష్మయ్య గురువారం అట్టహాసంగా బాధ్యతలు చేపట్టారు. ముందుగా తన ఇంటి నుండి పలు గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు, మరియు తన శ్రేయోబిలాషుల మధ్య బారీ ర్యాలీ చేపట్టి సొసైటీ కార్యాలయానికి చేరుకొని ప్రమాణ స్వీకారం చేపట్టారు. ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ ఉమాదేవి అయన చేత సంతకం చేయించి బాధ్యతలను అప్పగించారు. అనంతరం సభ్యులుగా ఆడవి అంజయ్య, చంటి వెంకటరెడ్డిలచే సంతకాలు చేయించారు. ఈసందర్భంగా జరిగిన సభలో సంతమాగులూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తేలప్రోలు రమేష్ మాట్లాడుతు రైతులకు సకాలంలో పంట రుణాలను అందించి వారి సమస్యలపై బాధ్యతగా పనిచేసే సత్తా లక్ష్మయ్యకు ఉందని తెలిపారు. ఈసందర్భంగా నూతన చైర్మన్ లక్ష్మయ్యను పలు గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ చిట్టిపోతు మస్తానయ్య, ఎఎంసీ వైస్ చైర్మన్ దేవినేని నరేంద్ర, ఎఎంసీ మాజీ చైర్మన్ నాగినేని రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు కొండేటి ఇజ్రాయల్, టీడీపీ నేతలు గొట్టిపాటి చౌదరిబాబు, చింతల శ్రీనివాసరావు, దూళిపాళ్ల రామగోవిందు, పోగుల శేఖర్, దేవినేని శివయ్య, అమరనేని కాశీ విశ్వనాధం,గొట్టిపాటి శంకర్, కట్టా రామకృష్ణ దద్దాల అంజయ్య, కత్తి అంజయ్య, గుంజి సుబ్బారావు,పోగుల శేఖర్, ముంద్రు దానయ్య సొసైటీ సూపర్ వైజర్ ఏడుకొండలు నాయక్, సీఈవో ఏలూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సొసైటీ చైర్మన్‌గా హనుమంతరావు ప్రమాణస్వీకారం



హనుమంతరావును సన్మానిస్తున్న టీడీపీ నేతలు

మార్టూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్ల సొసైటీ చైర్మన్‌గా గురువారం సొసైటీ భవనంలో కంభంపాటి హనుమంతరావు బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా త్రిమెన్ కమిటీలో ఇద్దరు సభ్యులు నాతాని మునిబాబు, తన్నీరు అంకమ్మరావులు కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హనుమంతరావును టీడీపీ నాయకులు అర్వపల్లి శ్రీనివాసరావు, వంకాయల వెంకటసుబ్బారావు, కోనంకి మణి, గుద్దంటి శంకర్, మాలెంపాటి రాఘవయ్య,యర్రా రమేష్, తన్నీరు శ్రీనివాసరావులు అభినందించారు.

రైతులకు ఎరువులు పంపిణీ

మండలంలోని వలపర్ల సొసైటీలో గురువారం రైతులకు ఏవో లావణ్య, సొసైటీ సీఈవో ఈదర నాగేశ్వరరావులు రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో ఏవో మాట్లాడుతూ వేసిన పంటలకు అవసరమైన ఎరువులను మాత్రమే రైతులు తీసుకువెళ్లాలన్నారు. ముందస్తుగా నిల్వలను ఉంచుకోవద్దన్నారు. అదేవిధంగా బహిరంగ మార్కెట్లో ఎరువుల దుకాణాలలో ఎంఆర్‌పీ ధరలకు మించి అధిక ధరలకు ఎరువులను అమ్మిన షాపు యజమానులపై కఠిన చర్యలును తీసుకుంటామన్నారు.

సహకార సంఘాలు స్వయంసమృద్ధి సాధించాలి

పంగులూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సహకారం సంఘాలు స్వయం సమృద్ధి సాధించే దిశగా ఎదగాలని, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాచిన చెంచు ప్రసాద్, కేవీ.సుబ్బారావు అన్నారు. జనకవరం పీఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం గురువారం పంగులూరులోని కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్‌గా చిలుకూరి కోటేశ్వరరావు (కోటయ్య) సభ్యులుగా చిలుకూరి రామాంజనేయులు, తలపనేని సాంబశివరావులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు డాక్టర్ బత్తులవీరనారాయణ, టీడీపీ సీనియర్ నాయకులు ఏడుకొండలు, గుర్రం శేఖర్, చింతలసహదేవుడు, శింగర్, మేడసుబ్బారావు, డీసీ అధ్యక్షుడు కుక్కపల్లి ఆంజనేయులు, పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లంనేని స్వామి, బత్తుల వెంకటరావు, రావుల సింగరకొండ, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, సీఈవో నాగబోయిన లక్ష్మి జాగర్లమూడి బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాలలో సొసైటీ చైర్మన్ల ప్రమాణ స్వీకారం

బల్లికురవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కే.రాజుపాలెం సొసైటీ చైర్మన్‌గా గొట్టిపాటి మారుతి, కమిటీ సభ్యులుగా గోలి ఏడుకొండలు, బోల్లినేని కోటేశ్వరరావులు గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. అలానే కొమ్మినేని వారిపాలెం సొసైటీ చైర్మన్‌గా కొమ్మాలపాటి రామారావు. సభ్యులుగా దివ్వె రాదకృష్ణ, కీర్తిపాటి శ్రీనివాసరావులు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు, సొసైటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ అభివృద్ధి సూచకపై శిక్షణ

చినగంజాం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పంచాయతీ అభివృద్ధి సూచికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీహెచ్.పూర్ణచంద్రరావు తెలిపారు. ప్రిన్సిపాల్, డీపీఆర్‌సీ అండ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఒంగోలు జిల్లా పరిషత్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తహసీల్దార్, వ్యవసాయాధికారి, చినగంజాం, సంతరావూరు పశువైద్యాధికారులు, ఏఎస్‌వో, సివల్ సప్లయిస్ డీటీ విపత్తు నిర్వహణాధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, గృహ నిర్మాణ శాఖ ఏఈ, సీడీపీవో, సూపర్‌వైజర్లు, ఏపీవో, ఏపీఎం, పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు పంచాయతీ అభివృద్ధి సూచిక(ప్రణాళికలు 1.0, 2.0)పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమునకు డిప్యూటీ ఎంపీడీవో కో కన్వీనర్ అయినందున పూర్తి బాధ్యత వహించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో తెలిపారు.

ఎక్సైజ్ అధికారులకు కలసి వచ్చిన డ్రైడే

- మూడు బెల్ట్ షాపుల వద్ద మద్యం స్వాధీనం
- ఒక్క కేసు కూడా నమోదు కాని వైనం



స్వాతంత్ర్య దినోత్సవం రోజు కొనసాగుతున్న బెల్ట్‌షాప్ (ఫైల్)



అద్దంకిలోని ఎక్సైజ్ కార్యాలయం

అద్దంకి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): డ్రైడే రోజు అద్దంకి ఎక్సైజ్ అధికారులకు కలసి వచ్చింది. బెల్ట్ షాపుల నిర్వాహకులు మద్యం అమ్మకాలు చేస్తూ పట్టుబడడంతో కాసులు పిండుకొనేందుకు అవకాశం వచ్చింది.

స్వాతంత్ర్య దినోత్సవం రోజు పట్టణంలో మాత్రం లైసెన్స్ ఉన్న మద్యం దుకాణాలు మూసివేశారు. కాని బెల్ట్ షాపుల నిర్వహకులు ముందుగానే కొనుగోలు చేసి మద్యం నిల్వ చేసుకొని, జోరుగా అమ్మకాలు చేశారు. అయితే 'కంచె చేను మేసిన' చందంగా మద్యం అమ్మకాలను నియంత్రించాల్సిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అందివచ్చిన అవకాశాన్ని సొమ్ము చేసుకున్నారు. అద్దంకి పట్టణంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజు మూడు చోట్ల బెల్ట్ షాపులపై దాడులు చేశారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, పలువురిని పట్టుకొన్నారు. బెల్ట్‌షాపులలో పట్టుబడ్డ మద్యం సీసాలను, అమ్మకాలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఎలాంటి కేసు నమోదు చేయకుండానే వదిలేశారు. పట్టుబడ్డ మద్యంతో పాటు వీరు లక్ష రూపాయల వరకు ముట్టజెప్పినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వారే యథేచ్ఛగా బెల్ట్‌షాపులు నిర్వహించడం గమనార్హం. మూడు నెలల క్రితం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అద్దంకి సర్కిల్ ఎస్‌హెచ్‌వో దీర్ఘకాలిక సెలవు లో వెళ్లడంతో మిగిలిన అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతా గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారం నడుపుతున్నట్లు తెలుస్తోంది. అంతా తానై నడిపించే ఓ అధికారి తనకు నమ్మిన బంటుగా ఉండే ఓ కానిస్టేబుల్ ను వసూలుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొని ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజు పట్టుబడ్డ ముగ్గురు బెల్ట్ షాపుల నిర్వాహకుల వద్ద 2 లక్షల రూపాయలు డిమాండ్ చేసిన సదరు కానిస్టేబుల్ చివరకు లక్ష రూపాయలకు బేరం సెటిల్ చేసినట్లు తెలుస్తోంది. ఇదే పంథా కొనసాగితే బెల్ట్ షాపులు మరింత విచ్చలవిడిగా పెరిగే అవకాశం ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అద్దంకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంకు ఎస్‌హెచ్‌వోగా ఓ సీఐను నియమించాల్సి ఉంది. దీంతో పాటు సిబ్బంది, అధికారుల ఆగడాలకు కూడా చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.